





దేవీ వైభవం!

దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం జిల్లావ్యాప్తంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రధానంగా రాజమహేంద్రవరంలోని దేవీచౌక్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రత్యేక పూజలతో అత్యంత ఘనంగా మొదలయ్యాయి. ఆ దృశ్యాలే ఇవి. (పక్కన) ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన నిడదవోలులోని కోట సత్తెమ్మ అమ్మవారు - 6లో



ఇసుక డ్రెడ్జింగ్‌లోనూ గోల్‌మాల్!



- వైసీపీ హయాంలో ఇదో మాయాజాలం
- దోచేసింది ఒకరు.. మధ్యలో ఇంకొకరు
- రూ.50 కోట్ల బిల్లు చెల్లించాలని ప్రభుత్వానికి లేఖలు
- బోట్స్‌మన్ సొసైటీలకు రూ.30 లక్షల బాకీతో పరారీ
- బాధితులంతా అధికారులపై ఒత్తిడి తెస్తున్న వైనం

వైసీపీ హయాంలో ఇసుక దోపిడీ వర్ణనాతీతం. ఇసుక అమ్మకాలు, డ్రెడ్జింగ్ పేరుతో అనేక కంపెనీల పేరుతో వైసీపీ పెద్దలే నిలువుదోపిడీ చేసేశారు. ఈ అక్రమ వ్యవహారాలు బహిరంగ రహస్యమే అయినా ప్రభుత్వ ఒత్తిడి మేరకు అధికారులూ మౌనం దాల్చారు. చివరకు స్థానిక అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా వారు సాధారణ తనిఖీలకూ వెళ్లలేని దుస్థితి. ఎంతమేర తవ్వుతున్నారు, సరిహద్దులేంటనే అంశాలూ వీరి పరిధిలో లేని పరిస్థితి. అంతా ఉన్నత స్థాయిలోనే వ్యవహారాలు నడిపోయాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ ఆగడాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. ఇసుక కుంభకోణం కూడా బయటకు వస్తోంది. అప్పట్లో గోదావరిలో ఇసుక డ్రెడ్జింగ్ చేయడానికి కాంట్రాక్టు కుదుర్చుకున్న రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీ డ్రెడ్జింగ్ చేయకుండా అక్రమ డ్రెడ్జింగ్‌దార్లకు సహకరించి, ఇవాళ తామే డ్రెడ్జింగ్ చేసినట్టు.. దానికి సుమారు రూ.50 కోట్లు చెల్లించాలంటూ అధికారులకు లేఖలు రాయడం విశేషం. అప్పట్లో ఆర్కే అనే వ్యక్తి గుత్తాధిపత్యం కింద ఇక్కడ అపరిమితంగా డ్రెడ్జింగ్ చేసేశారు. బోట్స్‌మన్ సొసైటీల ద్వారా ఇసుక డ్రెడ్జింగ్ జరిపి.. చివరకు వారికి రూ.30 లక్షలు బాకీ ఉంచి మరీ వెళ్లిపోయారు. దీంతో వాళ్లంతా లబోదిబోమంటున్నారు.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరిలో ఇసుక దిబ్బలు తొలగించి, గోదావరిలో బ్యారేజీ లోపల నీరు ఎక్కువ నిల్వ ఉంచాలనే ఆలోచన గతంలోనూ ఉంది. 2014- 2019 మధ్య టీడీపీ ప్రభుత్వం డ్రెడ్జింగ్ చేయించి పిచ్చుకలంకను మెరకచేసింది. డ్రెడ్జింగ్ అంటే డ్రెడ్జరును గోదావరిలోకి తీసుకుని వెళ్లి, దాని గొట్టాలను గోదావరి గట్టు మీద ఇసుక గుట్ట వేయాల్సినచోటు వరకూ అమర్చి ఇసుకను తోడేస్తారు. ఈ ఇసుక నీటితో కలసి ఉంటుంది. కాబట్టి నీరు ఇంకేటట్టు ముందుగానే ఇరిగేషన్ అధికారుల సమక్షంలో ఒడ్డున పాండ్స్ నిర్మిస్తారు. డ్రెడ్జింగ్ చేసిన ఇసుకను ఈ పాండ్స్‌లోకి గొట్టాల ద్వారా పంపిస్తారు. వాటిలో నీరు ఇంకిపోయేటట్టు చేస్తారు. నీరు ఇంకిన తర్వాత ఇసుకను ఇరిగేషన్ అధికారులకు అప్పగించాలి. వారు వేరే కాంట్రాక్టర్‌తో అమ్మించే ప్రయత్నం చేయాలి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇలా పద్ధతి ప్రకారం జరిగింది. అప్పట్లో డ్రెడ్జింగ్ చేసిన కాంట్రాక్టర్‌కు టన్నుకు రూ.119 వరకూ ఇచ్చారు. పిచ్చుకలంక కూడా మెరక అయింది. కొంత ఇసుక బయటకు అమ్మారు. కానీ 2019లో వైసీపీ గెలిచిన తర్వాత ఇసుక విధానాల్లో అనేక దోపిడీ మార్గాలను ఎన్నుకున్నారు. 2022లో మే నెలలో సుమారు 3 కోట్ల టన్నుల ఇసుక మేటలుగా ఉందని అంచనా వేసి, గోదావరి ఎడమగట్టు బ్యారేజీకి దిగువన 3 కిలోమీటర్ల తర్వాత ఫోర్త్‌బ్రిడ్జి వరకూ డ్రెడ్జింగ్ చేయడానికి రూ.144.23 కోట్లతో టెండర్లు పిలించారు. కుడివైపున బ్యారేజీ నుంచి అదే దూరం వరకూ డ్రెడ్జింగ్ చేయడానికి రూ.128.23 కోట్లతో టెండర్లు పిలిచారు. మొత్తం రూ.272.46 కోట్లు. వీటికి మొత్తం మూడు కంపెనీలు టెండర్లు దాఖలు చేశాయి. అందులో రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఒకటి. ఈ కంపెనీకి రాకుండా వేరే కంపెనీ ఈ టెండర్లలో అర్హత సాధించింది. కానీ రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీ వైసీపీ పెద్దలకు కావలసిన వ్యక్తికి సంబంధించిందిగా ప్రచారం జరిగింది. ఆయన అప్పట్లో తెలంగాణ ప్రాంతానికి చెందిన ఓ ఎంపీగా ఉండేవారు. ఇవాళ మంత్రి. వైసీపీ పెద్దలు సదరు కంపెనీకి అర్హత లేకపోయినా అదే కంపెనీకి టెండర్లు ఖరారు చేయాలని ఒత్తిడి చేశారు. అప్పట్లో ధవళేశ్వరం ఇరిగేషన్ ఎస్ఈగా ఉన్న రాంబాబు దీనిని వ్యతిరేకించారు. నిబంధనల ప్రకారం అర్హత సాధించిన కంపెనీని కాదని, ఏ అర్హత లేని రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీకి తాము టెండర్లు ఖరారు చేయలేనని ఖరాఖండీగా చెప్పారు. దాంతో ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి తెచ్చింది. ఆయన పట్టించుకోకపోవడంతో ఆకస్మికంగా ఓ ప్రాధాన్యం లేని ప్రాంతానికి బదిలీచేసింది. పోలవరం ప్రాజెక్టులో ఎస్ఈగా ఉన్న ఓ అధికారికి ఇన్‌చార్జి ఇచ్చి కథ నడిపించారు. పైగా అప్పట్లో వైసీపీ వర్గాలకు చెందిన నారాయణరెడ్డి అనే ఉన్నతాధికారి కూడా సహకరించారు. పైగా ఈ కంపెనీకి బ్యాంక్ గ్యారంటీలోనూ మతలబు జరిగింది. విదేశాలకు చెందిన యూరో బ్యాంక్‌ను బ్యాంక్ గ్యారంటీగా చూపడం గమనార్హం. ఇలా పనులను రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీకి కట్టబెట్టారు.

ఇక్కడా కుట్రే..

డ్రెడ్జింగ్ పనులను రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీకి కట్టబెట్టిన వైసీపీ పెద్దల బుర్రలలో ఏముందోకానీ, వాళ్లు ఏం చేశారోగానీ ఈ కంపెనీ డ్రెడ్జింగ్ చేయలేదు. గతేడాది అక్టోబరు వరకూ ఇరిగేషన్ అధికారులు వాళ్లకు నోటీసులు ఇస్తూనే ఉన్నారు. వాళ్లు డ్రెడ్జింగ్ మిషన్లు దింపలేదు. పాండ్స్ తవ్వలేదు. తవ్విన ఇసుకను లెక్కించడానికి ఇరిగేషన్ అధికార్లకు బాధ్యత అప్పగించలేదు. కానీ అప్పటికే ఇసుక గుత్తాధిపత్యం సాధించి, డ్రెడ్జింగ్ పడవలతో ఇసుకను ఆర్కే అనే వ్యక్తి దోచేయడం ప్రారంభించారు. దీంతో కొందరు కోర్టుకు వెళ్లడంతో హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా స్పందించాయి. ఈ నేపథ్యంలో వైసీపీ పెద్దలలో భయం కలిగి, వెంటనే మరో మోసానికి ఒడిగట్టారు. అంతవరకూ డ్రెడ్జింగ్ పనిచేయని రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీని ముందుకు తెచ్చారు. వారి పేరుతో ఆర్కే అనే వ్యక్తి సబ్ లీజు కింద బోట్స్‌మన్ సొసైటీలతో కలసి ఇసుక తీయిస్తున్నట్టు కథ అల్లారు. దీనికి తటపటాయించినప్పటికీ చివరకు ఇరిగేషన్ అధికారులు కూడా తలూపకతప్పలేదు. ఈలోగా ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అప్పటివరకూ అక్రమంగా ఇసుక తవ్విన వ్యక్తులు కనిపించకపోయారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన జూన్ 4నే డ్రెడ్జింగ్ పడవలన్నీ అదృశ్యమయ్యాయి. కానీ ఇటీవల రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీ తాము సుమారు 32 లక్షల టన్నుల ఇసుక డ్రెడ్జింగ్ చేసినట్టు చెబుతూ తమకు టన్నుకు రూ.150 వంతున రూ.50 కోట్ల వరకూ ఇవ్వాలని అధికారులకు లేఖలు రాయడంతో పెద్ద చర్చనీయాంశమైంది. అప్పట్లో జరిగిన అక్రమాలపై మౌనం వహించిన అధికారులు నెమ్మదిగా వాస్తవాలు చెప్పడం మొదలుపెట్టారు. పైగా డ్రెడ్జింగ్ చేసినట్టు చెబుతున్న కాంట్రాక్టు సంస్థ విదేశాలకు చెందిన యూరో బ్యాంక్‌ను గ్యారంటీ చూపడం, ఆ బ్యాంక్ గ్యారంటీ చెల్లదనే వాదన, ఈడీ కూడా విచారణ చేస్తున్నట్టు తెలియడంతో అధికారులు దృష్టిపెట్టినట్టు సమాచారం. ఇటు బోట్స్‌మన్ సొసైటీలు తమతో ఇసుక తీయించి బకాయి పెట్టడంతో జిల్లా యంత్రాంగం చుట్టూ తిరుగుతున్నాయి. దోచేసింది ఒకరైతే.. పనిచేయకుండా రూ.50 కోట్లు కొట్టేసే ప్రయత్నంలో మరొకరు ఉండగా, పనిచేసిన బోట్స్‌మన్ సొసైటీలు మాత్రం మోసపోయి ఆందోళన చెందుతున్నాయి. ప్రస్తుతం ఉచిత ఇసుక అమలులో భాగంగా ఇసుకతీత మొదలైంది. ఇప్పటివరకూ 44 బోట్స్‌మన్ సొసైటీలకు అనుమతిచ్చారు. కానీ వాటికి పద్ధతి ప్రకారం ఇంతవరకూ ప్రొసీడింగ్ ఆర్డర్లు లేవు. ఎవరు డబ్బులు ఇస్తారో చెప్పలేదు. ఏ సొసైటీకి ఎంత ఇసుక తీత అప్పగించారో స్పష్టత లేదు. గతంలో పనిచేసిన వారికి సంబంధించిన వ్యక్తే మళ్లీ రంగ ప్రవేశం చేస్తున్నాడని, బోట్స్‌మన్ సొసైటీలన్నీ ఆయన చేతిలో పెట్టుకుని, తానే చేసినట్టు ఒక ఏజెన్సీని ఏర్పాటు చేయనున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై స్పష్టత లేక ప్రస్తుతం ఇసుక తీస్తున్నారే కానీ అమ్మకాలు లేవు.



భగ్గుమన్న కూరగాయలు

- బహిరంగ మార్కెట్లో ఒక్కసారిగా భారీగా పెరిగిన ధరలు
- ఏ కూరగాయలైనా కిలో రూ.60 పైనే
- దసరా డిమాండు కారణమంటున్న వెజిటబుల్స్ వర్తకులు
- దీపావళి వెళ్లే వరకూ ఇదే పరిస్థితి అంటూ అంచనా

(రాజమహేంద్రవరం అర్బన్)

కూరగాయల ధరలు బహిరంగ మార్కెట్లో ఒక్కసారిగా భగ్గుమన్నాయి. కేవలం రెండు, మూడు రోజుల వ్యవధిలోనే కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకూ పెరుగుదల కనిపిస్తోంది. వంకాయలు, బీరకాయలు, బెండకాయలు, టమోటా.. ఇలా ఏ రకం కూరగాయలైనా కిలో రూ.60 పైనే ధర ఉంది. కొన్ని రూ.80 కూడా అమ్ముతున్నారు. ప్రత్యేకించి టమోటా, వంకాయల ధరలు రోజు రోజుకూ పైపైకి ఎగబాకుతున్నాయి. టమోటా కిలో రూ.60కు చేరుకుంది. రెండు, మూడు రోజుల వరకూ టమోటా కిలో రూ.40కు విక్రయించేవారు. ఒక్కసారిగా ధర పెరిగింది. వంకాయలు గులాబీ రకం రూ.80కు అమ్ముతున్నారు. దొమ్మేరు వంకాయలు కిలో రూ.60కి పలుకుతోంది. చివరకు బెండకాయలు, దొండకాయలు వంటివి డిమాండు తక్కువగా ఉండే కూరగాయలు కూడా కిలో రూ.60 అమ్ముతున్నారు. కూరగాయల ధరల పెరుగుదలకు వర్తకులు అనేక కారణాలు చెబుతున్నారు. ప్రస్తుతం రైతుబజార్లలోని రైతులు కూడా బయట మార్కెట్ల నుంచే కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. వీరు పండించే పంటలు ఇటీవలి వర్షాలకు పూర్తిగా దెబ్బతినడంతో రంభ-ఊర్వశి, మడికి వంటి హోల్‌సేల్ మార్కెట్ల నుంచే కూరగాయలు తీసుకొచ్చి రైతుబజార్లలో విక్రయిస్తున్నారు. దీపావళి వెళ్లే వరకూ ఈ పరిస్థితి తప్పదనే అభిప్రాయం అటు రైతులు, ఇటు వ్యాపారుల్లోనూ వ్యక్తమవుతోంది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకావడంతో దసరా పర్వదినం రోజుల్లో చాలామంది నాన్‌వెజ్‌కు దూరంగా ఉంటారు. కొంతమంది భవానీ మాలలు ధరిస్తారు. వీరంతా దాదాపుగా రెండు వారాలపాటు చికెన్, మటన్ వంటివి ముట్టుకోరు. దీంతో ఆయా కుటుంబాల్లో వంటలకు కూరగాయలే వినియోగిస్తుంటారు. దీంతో కూరగాయల వినియోగం భారీగా పెరుగుతుంది. కానీ మార్కెట్లో వినియోగదారుల అవసరాలకు తగ్గట్టు కూరగాయలు రావడంలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు కూరగాయల పంటలన్నీ దాదాపుగా తుడిచిపెట్టుకుపోయాయి. స్థానికంగా సీతానగరం, రావులపాలెం, సిద్ధాంతం తదితర లంక ప్రాంతాల్లో సాగుచేసే బెండ, బీర, దొండ, ఆనప, చిక్కుడు వంటి పంటలు ఇప్పుడిప్పుడే మళ్లీ ఊపిరిపోసుకుంటున్నాయి. దిగుబడులు అందుకోవాలంటే మరో రెండు, మూడు వారాలు ఆగాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో హోల్‌సేల్ ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుంటున్నారు. వాటిని స్థానిక వ్యాపారులు చిల్లర మార్కెట్లో విక్రయించేసరికి ధరలు ఆకాశాన్నంటేలా పెరిగిపోతున్నాయి. దీంతో కూరగాయలు కొనాలంటేనే సాధారణ, మధ్యతరగతి ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. ధరలను కొంతైనా నియంత్రించాల్సిన జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు దృష్టిపెట్టకపోవడంతో కూరగాయాలు' ప్రజలకు తప్పేలా కనిపించడంలేదు.

కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ బదిలీ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 3: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న పీఎం సత్యవేణిని విశాఖపట్నం యూడీసీ పీవోగా ప్రభుత్వం బదిలీచేసింది. ఆమె స్థానంలో ఇంకా ఎవరినీ ప్రభుత్వం నియమించలేదు. గురువారం సాయంత్రం ఆమె రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా సత్యవేణికి నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్, అధికారులు వీడ్కోలు పలికారు. ఆమె సేవలను ప్రశంసించారు.

డ్వామా పీడీగా మహేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మహేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు3: తూర్పుగోదావరి డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎ. నాగమహేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. బొమ్మూరులో వైటీసీ ప్రాంగణంలో డ్వామా కార్యాలయంలో ఈయన కృష్ణా జిల్లా డ్వామా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ ఏవో కిషోర్, సిబ్బంది, గ్రామాల ఏపీవోలు స్వాగతించారు. అంతకుముందు డ్వామా పీడీగా బాధ్యతలు స్వీకరించిన నాగమహేశ్వరరావు జిల్లా కలెక్టర్ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఐలకు పోస్టింగ్‌లు

రాజమహేంద్రవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వీఆర్‌లో ఉన్న సీఐలకు స్టేషన్లు కేటాయిస్తూ ఎస్పీ నరసింహ కిషోర్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా వీఆర్‌లో ఉన్న ఎండీ అబ్దుల్‌నబీని ట్రాఫిక్-1, కె.మంగాదేవిని మహిళా పోలీస్‌స్టేషన్, పీఈ పవన్‌కుమార్ రెడ్డిని డీసీఆర్‌బీకి, బి.విజయ్‌శంకర్‌ని వన్‌టౌన్ సీసీఎస్, ఇ.బాలశౌరీని సీసీఎస్-2, వై.రాంబాబుని సీసీఎస్-3, డీసీఆర్బీలో ఉన్న చింతా సూరిబాబును ట్రాఫిక్-2కి బదిలీ చేశారు. నిజాయితీగా ఉన్న కొందరు సీఐలకు మంచి సీట్లు దక్కలేదనే విమర్శలు వినవస్తున్నాయి. ఇక్కడే ట్రాఫిక్‌లో పనిచేసి పలు ఆరోపణలు ఎదుర్కొని విధుల నుంచి తొలగించగా ప్రయత్నాలు చేసుకొని డీసీఆర్బీలో పనిచేస్తున్న సీఐకి మళ్లీ గతంలో పనిచేసిన సీటును ఇచ్చారని, అలాగే 'ట్రై' చేసుకోని వారిని మళ్లీ లూప్ లైన్‌లోకి నెట్టారనే చర్చ జరుగుతోంది. ఉన్నత స్థాయిలో ప్రయత్నాలు చేసుకోవడంతో ఆయా స్థానాలు పొందినట్టు చెబుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

బంగారుకొండ ప్లస్ ద్వారా పోషణ విలువల కిట్లు

గెయిల్ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 3: సామ్-మామ్ మధ్య తేడాలు, పిల్లల ఎదుగుదల సాధారణ స్థితికి తీసుకుని వచ్చే లక్ష్యంలో భాగంగా జిల్లాలో బంగారు కొండ ప్లస్ కార్యక్రమాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద చేపట్టే ప్రతిపాదనలు సిద్ధం చేశామని కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గెయిల్ ప్రతినిధులతో గురువారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వయస్సుకు తగ్గ బరువు, ఎదుగుదల లేని, రక్తహీనత, తీవ్ర పోషకాహార లోపం గల పిల్లలను గుర్తించి వారిని సాధారణ స్థితికి తీసుకురావడం కోసం బంగారు కొండ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో ప్రయోగాత్మకంగా చేపట్టినట్టు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన సంబంధిత అంశాలను జోడించి బంగారు కొండ ప్లస్ కార్యక్రమాన్ని ఈ ఏడాది చేపట్టనున్నట్టు తెలిపారు. గత ఏడాది చేపట్టిన బంగారుకొండ కింద 1283 మందికి కిట్స్ అందించి 1169 మందిని సాధారణ స్థితికి తీసుకు వచ్చినట్టు తెలిపారు. నూటికి నూరుశాతం ఫలితాలు సాధించడం లక్ష్యంగా చేసుకుని అడుగులు వేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 469 మంది చిన్నారులు ఈ కేటగిరిలో ఉన్నట్టు గుర్తించామన్నారు. ఇతర కార్పొరేట్ సంస్థల సహకారంతో కౌమరదశలో ఉన్న బాలికలకు మునగపొడి అందించి రక్తహీనతను అధిగమించి అనీమియా లేకుండా పరిరక్షణా బాధ్యతలు చేపట్టామన్నారు. గెయిల్ చీఫ్ మేనేజరు కేవీఎస్ రావు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం తరఫున అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, పౌష్టికాహారలోపం నిర్మూలన, సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మేనేజరు (హెచ్‌ఆర్) ప్రభాకర్, ఐసీడీఎస్ జిల్లా స్త్రీశిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారి, ఇండస్ట్రీస్ అధికారి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి టెట్ పరీక్షలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లు శుక్రవారం నుంచి 21వ తేదీ వరకూ నిర్వహిస్తారని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. లూథర్‌గిరిలోని రాజీవ్‌గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5 వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. గంటన్నర ముందు నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. మొత్తం 9,988 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉందన్నారు. సహాయ కేంద్రాలను ఏర్పాటుచేశామని, కేవీ సూర్యనారాయణ 9949602721, ఎస్ శ్రీనివాస్‌ప్రసాద్ 8985943354లలో సంప్రదించవచ్చని తెలిపారు. హాల్ టికెట్‌తోపాటు ఆధార్, డ్రైవింగ్ లైసెన్సు, ఓటరు గుర్తింపుకార్డు తదితర ఏదేని గుర్తింపు కార్డును తీసుకురావాలన్నారు. సెల్‌ఫోన్, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్, కాలిక్యులేటర్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌లో ఏవైనా తప్పులుంటే ఆధారాలు చూపించి పరీక్ష కేంద్రంలోని డిపార్ట్‌మెంటల్ అధికారి దగ్గర సరిచేయించుకోవచ్చన్నారు.



జీజీహెచ్ ప్రధాన భవనం ఎదుట దివ్యాంగుల ధర్నా దృశ్యం

జీజీహెచ్ ఎదుట దివ్యాంగుల ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 3 : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్) ఎదుట గురువారం పలువురు దివ్యాంగులు ధర్నాకు దిగారు. రూ.15,000 పెన్షన్‌కు సదరం సర్టిఫికెట్ల కోసం వచ్చిన తమకు సరైన సౌకర్యాలు కల్పించడంలేదని, ఆసుపత్రి సిబ్బంది తమ దరఖాస్తులను తీసుకోవడంలేదని జీజీహెచ్ ప్రధాన భవనం ఎదుట ధర్నా చేశారు. దరఖాస్తులు తీసుకోకపోవడంతోపాటు వీల్‌చైర్లు సమకూర్చడంలేదని ఆందోళన చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేయడంతో కొంతసేపు అలజడి నెలకొంది. దివ్యాంగుల ఆందోళనతో అప్రమత్తమైన ఆసుపత్రి అధికారులు అక్కడకు చేరుకుని వారితో మాట్లాడారు. అధికారుల హామీతో ఆందోళన విరమించారు. కాగా గురువారం కూడా దివ్యాంగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన స్కూల్ అసిస్టెంట్ సస్పెన్షన్

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 3: రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట జడ్పీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావు విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ జరిపి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉపాధ్యాయుడిని కలెక్టర్ ప్రశాంతి సస్పెండ్ చేశారు. ఈమేరకు గురువారం కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలలో చదువుతున్న ఓ బాలిక ఇచ్చిన ఫిర్యాదుమేరకు కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ముగ్గురు అధికారులు విచారణ చేసి జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావుకు నివేదిక అందించారు. దీంతో ఏపీ సివిల్ సర్వీసెస్ కండక్ట్ రూల్స్‌ను ఉల్లంఘన, 1964ను అనుసరించి స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావుపై క్రమశిక్షణ చర్యల మేరకు రూల్ 20 ప్రకారం చేసిన ఆరోపణల నిర్ధారణ నేపథ్యంలో సస్పెన్షన్ ఆర్డర్ జారీచేసినట్టు పేర్కొన్నారు.



బాలాత్రిపురసుందరిగా తలుపులమ్మ అమ్మవారు

కాకినాడ జిల్లా తుని సమీపంలోని తలుపులమ్మ లోవలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు తొలిరోజున శ్రీబాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో అభయమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు, భవానీ దీక్షాపరులు అమ్మవారిని దర్శించుకున్నారు. - తుని రూరల్



బాలాత్రిపురసుందరిగా మాణిక్యాంబ అమ్మవారు

ద్వాదశ శక్తి పీఠమైన ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మాణిక్యాంబ అమ్మవారికి ఉదయం లక్ష కుంకుమార్చన, మధ్యాహ్నం శ్రీచక్రనవావరణార్చన, సాయంత్రం ప్రదోషకాలార్చన, ధూప సేవ, పల్లకి సేవ, సువర్ణ, రజత పుష్పాలతో అర్చన జరిపారు. సప్త హారతులు ఇచ్చారు. వసంత మండపంలో అమ్మవారు బాలాత్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. - ద్రాక్షారామ



పాదగయలో రాజరాజేశ్వరి అలంకారంలో...

కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్ల శరన్నవరాత్ర శతచండీయాగ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. రాజరాజేశ్వరీదేవి తొలిరోజు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పురుహూతికాదేవికి శ్రీచక్ర నవావరణార్చన సహిత సహస్ర పుష్పార్చన, శ్రీచక్ర లక్ష కుంకుమార్చన జరిగాయి. - పిఠాపురం



సామర్లకోటలో బాలాత్రిపురసుందరిగా...

పంచారామ క్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారికి పండితులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని బాలాత్రిపురసుందరిగా సర్వాంగసుందరంగా అలంకరించగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

దేవీ వైభవం



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రసిద్ధ క్షేత్రాలైన ద్రాక్షారామ, పిఠాపురం, సామర్లకోట, తలుపులమ్మ లోవ, అన్నవరం ఆలయాల్లో అమ్మవార్లు తొలిరోజైన గురువారం పలు అవతారాల్లో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పునీతులయ్యారు. రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో 91వ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. బాలాత్రిపురసుందరి అమ్మవారికి అర్చక స్వామి ప్రత్యేక పూజలు చేసి హారతి ఇస్తున్న దృశ్యాన్ని ఈ చిత్రంలో చూడొచ్చు.



విద్యుద్దీపాల వెలుగులో దేవీచౌక్

దేదీప్యమానంగా దేవీచౌక్

మిరుమిట్లు గొలిపిన విద్యుద్దీపాలంకరణలు

స్వర్ణకవచ కనకదుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు



అమ్మవారికి పూజ చేస్తున్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 3: రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో బాలాత్రిపురసుందరీదేవి 91వ శరన్నవరాత్రి మహోత్సవాలను ఉత్సవ కమిటీ లాంఛనంగా ప్రారంభించింది. గురువారం ఉదయం 8.40 గంటలకు కలశస్థాపన చేశారు. కుంకుమ పూజల అనంతరం, మంగళ వాయిద్యాల నడుమ అఖండ హారతి ఇచ్చారు. నాలుగు లాంతర్ల సెంటరుగా ఉన్న దేవీ చౌక్‌లో బత్తుల వంశస్తులు బాలాత్రిపురసుందరీదేవిని ప్రతిష్ఠించిన నాటి నుంచి ఈ కూడలికి దేవీచౌక్‌గా ప్రజలే నామకరణం ప్రజలే చేశారు. 90 ఏళ్లగా అమ్మవారికి శరన్నవరాత్రి ఉత్సవాలను క్రమం తప్పకుండా చేస్తున్నారు. తొలిరోజు అమ్మవారు స్వర్ణకవచ కనదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి పది గంటలకు కనకదుర్గ మహత్యం నాటకం ప్రదర్శన జరిగింది. ఇక్కడ కళ్లు మిరుమిట్లు గొలిపే విధంగా విద్యుత్ దీపాలంకరణ చేశారు. విజయవాడ కనకదుర్గమ్మతల్లి ఆలయ శిఖరం ఆకారంలో భారీ సెట్టింగ్ ఏర్పాటు చేశారు. దశావతారాలు, సీతారాములు, గణపతి, లక్ష్మీదేవి అయ్యప్ప స్వామి భారీ సెట్టింగులు, వెంకటేశ్వర స్వామి, విష్ణుమూర్తి విద్యుత్ దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.






అన్నపూర్ణాదేవి రూపంలో ఐశ్వర్యాంబిక అమ్మవారు, సామూహిక కుంకుమార్చనలో భక్తులు

శ్రీపీఠంలో మహా శక్తి యాగం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 3: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కాకినాడ శ్రీపీఠంలో స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో 11 రోజుల పాటు జరిగే మహా శక్తి యాగం మహా క్రతువు వేలాది మంది భక్తుల నడుమ గురువారం వైభవంగా ప్రారంభమైంది. ఒకే రకమైన ఎరుపు రంగు దీక్షా వస్త్రాలను ధరించిన మహిళలు శతకోటి కుంకుమార్చనలో అత్యంత భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఐశ్వర్యాంబిక, పార్వతి పరమేశ్వర, అమ్మ దుర్గాదేవి పాహిమాం అంటూ భక్తుల నామస్మరణతో శ్రీపీఠం పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. వేద పండితులు విఘ్నేశ్వర పూజ, సంకల్పం, అధిష్టాన దేవతల హోమం, స్వాహాకర బగళాముఖి జపాత్మక హోమం, శతకోటి కుంకుమార్చన, రెండుసార్లు లలితా సహస్రనామం, ఒకసారి దేవీ ఖడ్గమాలను భక్తులతో జపింపచేశారు. మహాశక్తి యాగం విశిష్టతను స్వామీజీ భక్తులకు వివరించారు. సాయంత్రం లక్ష పుష్పార్చన వైభవంగా జరిగింది. తొలిరోజు సుమారు 28వేలు మంది భక్తులు పాల్గొన్నారు. కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు నేతృత్వంలో సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు, రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, టౌన్ సీఐలు కృష్ణ, సునీల్, ట్రాఫిక్ సీఐ డి.రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.



మహాశక్తి యాగ క్రతువును వివరిస్తున్న పరిపూర్ణానంద సరస్వతి స్వామి



బాల అలంకారంలో వనదుర్గ

రత్నగిరిపై ప్రారంభమైన శరన్నవరాత్రి వేడుకలు



అన్నవరం, అక్టోబరు 3: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో శరన్నవరాత్రి వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అనివేటి మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించారు. ఉదయం 8 గంటలకు ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, మంటపారాధన నిర్వహించారు. రుత్వికులకు దీక్షా వస్త్రాలను ఛైర్మన్ రోహిత్ అందజేశారు. అనంతరం దర్బారు మండపంలో చండీ సప్తశతి పారాయణ, సూర్యనమస్కారాలు, నవావరణార్చన, లింగార్చన, బాల గాయత్రి జపం నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి వనదుర్గ, కనకదుర్గ ఆలయాల్లో కుంకుమార్చనలు జరిపారు. తొలిరోజున వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు బాల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.08 కోట్లు

బంగారం 19 గ్రాములు, వెండి 735 గ్రాములు



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, అక్టోబరు 3: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు టీవీఎస్ ప్రసాద్, ఎన్వీఎస్వీ ప్రసాదరాజు సమక్షంలో గురువారం తెరిచి లెక్కించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.90,26,494, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.18,63, 141... మొత్తం రూ.1.08 కోట్లు ఆదాయం వచ్చింది. 35 రోజులకు బంగారం 19 గ్రాములు, వెండి 735 గ్రాములు, పలు దేశాల కరెన్సీ లభించాయని ఉప కమిషనరు, ఈవో నల్లం చక్రధర రావు తెలిపారు. క్షేత్రపాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.2,36,510 లభించింది. లెక్కింపులో గ్రామస్తులు, ఆలయ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు 'శ్రీప్రకాష్'లో ప్రారంభమైన వాలీబాల్ చాంపియన్‌షిప్



హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

దివాన్‌చెరువు, అక్టోబరు 3: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో సీబీఎస్ఈ క్లస్టర్-7 వాలీబాల్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 110 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి 1400 మందికి పైగా క్రీడాకారులు, 150 మంది కోచ్‌లు, మేనేజర్లు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, తూర్పు గోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు యశ్వంత్ (జెస్సీ), సీబీఎస్ఈ పరిశీలకుడు కిషోర్‌కుమార్ హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని విజయ్‌ప్రకాష్, సీబీఎస్ఈ పతాకాన్ని కిషోర్‌కుమార్, పాఠశాల పతాకాన్ని యశ్వంత్ ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. విజయప్రకాష్ మాట్లాడుతూ ఇటువంటి పోటీల్లో పాల్గొనడం వల్ల సామాజిక నైపుణ్యాలు వృద్ధి చెందడంతో పాటు క్రీడా నైపుణ్యాలు నేర్చుకునేందుకు వీలవుతుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులను, వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీప్రకాష్ విద్యానికేతన్ సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రిన్సిపాల్ విమల, మేనేజరు ఏఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



తుని రూరల్: కాకినాడ జిల్లా తుని శ్రీప్రకాష్ విద్యా సంస్థలల్లో సీబీఎస్ఈ క్లస్టర్-7 కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. బాలికల విభాగంలో అండర్ -14, 17, 19 విభాగాల్లో సుమారు 1,200 మంది విద్యార్థినులు నువ్వా నేనా అన్న రీతిలో తలపడుతున్నారు. శుక్రవారం పోటీలు ముగుస్తాయని, అనంతరం విజేతలకు హోం మంత్రి వంగలపూడి అనిత బహుమతులు ప్రదానం చేస్తారని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు.

విజయ డెయిరీ నుంచి తాత్కాలికంగా నెయ్యి కొనుగోలు

» 15 రోజులకు 7వేల కిలోలు » కిలో రూ.640 చొప్పున ఆర్డర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అన్నవరం, అక్టోబరు 3: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ప్రసాదం తయారీకి 'నిండుకుంటున్న నెయ్యి నిల్వలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం వచ్చిన కథనంతో అన్నవరం దేవస్థానం అధికారుల్లో కదలిక వచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడే వరకు విజయ డెయిరీ నుంచి నెయ్యిని తాత్కాలికంగా కొనుగోలు చేయాలని వారు నిర్ణయించారు. 15 రోజులకు అవసరమయ్యే 7వేల కిలోల నెయ్యిని కిలో రూ.640 చొప్పున కొనుగోలు చేసేందుకు విజయ డెయిరీకి గురువారం ఆర్డర్ పెట్టారు. ఒకట్రెండు రోజుల్లో నెయ్యి ఆలయానికి చేరుతుందని అధికారులు వెల్లడించారు.

కాలువలో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 3: పుష్కర కాలువలో పడి గల్లంతైన బాలుడి మృతదేహం గురువారం లభ్యమైంది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఉప్పనబోయిన సతీష్ (15) బుధవారం బహిర్భూమికి అని బయటకు వెళ్లి పుష్కర కాలువలో పడి గల్లంతైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచీ గాలించినా ఫలితం లేకపోయింది. గురువారం బాలుడి మృతదేహాన్ని స్థానికులు, గజ ఈతగాళ్లు వెలికితీశారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అందరూ వున్నా ఆదరించేవారు లేక

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

నిలువరించి పోలీసులకు అప్పగించిన స్థానికులు

స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి తరలింపు



వృద్ధురాలిని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి అప్పగిస్తున్న త్రీటౌన్ పోలీసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 3: ఇద్దరు కుమారులు, పెద్ద కుటుంబం ఉన్నా ఆదరించే వారు లేక 75 ఏళ్ల వృద్ధురాలు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కరాల రేవుకు చేరుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనను చూసిన స్థానికులు అడ్డుకుని త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే... పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురానికి చెందిన తుమ్మిడి నాగరత్నానికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారిని పెద్ద చేసి పెళ్లిళ్లు చేసి ఇద్దరికి ఇళ్లు కట్టించి ఇచ్చారు. మూడేళ్ల క్రితం భర్త మరణించాడు. కుమారుల్లో ఒకరు మరణించగా అతని కుమార్తెను పెంచి తాను ఉంటున్న ఇంటిని ఆమెకు ఇచ్చేసింది. దీనిని తప్పుగా భావించిన మిగిలిన ఇద్దరు కుమారులు, కోడళ్లు వారి ఇళ్ల వద్ద నాగరత్నం ఉండడానికి ఇష్టపడలేదు. దీంతో ఆమె పెన్షన్ సొమ్ముతో జీవిస్తోంది. వయోభారంతో శరీరం పనిచేయకపోవడంతో కుమారులను ఆశ్రయం అడగ్గా వారు ఒప్పుకోలేదు. దీంతో చూసే దిక్కులేక కట్టుబట్టలతో గురువారం ఇల్లు వదిలి బస్సు ఎక్కి రాజమహేంద్రవరం చేరుకుంది. పుష్కరాల రేవు వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని వెళ్తుండగా స్థానిక చిరు వ్యాపారాలు రక్షించి త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. దీంతో ఆమె తన బాధను పోలీసులకు చెప్పుకుంది. వారు వృద్ధురాలిని లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి తరలించారు. నిర్వాహకుడు గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ఇక్కడ ఉన్న 30 మందితో నాగరత్నం కలిసి ఉండటం వల్ల ఒంటరిననే ఫీలింగ్ పోతుందన్నారు. బంధువులు వస్తే పోలీసుల ద్వారా వారికి అప్పగిస్తామని చెప్పారు.

రంపచోడవరం డిప్యూటీ డైరెక్టర్ బాధ్యతలు

కాకినాడ జిల్లా ఏటీడబ్ల్యు స్థాయి అధికారికి

వివాదాస్పదంగా గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు

రంపచోడవరం, అక్టోబరు 3: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు ఉత్తర్వులతో పాడేరు నుంచి రంపచోడవరం గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్‌గా వచ్చిన ఓ అధికారిని తప్పించి కాకినాడ జిల్లాలోని దిగువ అధికారి ఒకరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గిరిజన సంక్షేమ డైరెక్టర్ వివాదాస్పద ఉత్తర్వులిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి జిల్లా కలెక్టరు దినేష్‌కుమార్ ఆదేశాలతో ఐ.కొండలరావు రంపచోడవరం గిరిజన సంక్షేమ డీడీగా పాడేరు నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన్ను తప్పించి సహాయ గిరిజన సంక్షేమ అధికారి హోదాతో కాకినాడ జిల్లాలో పని చేస్తున్న ఓ అధికారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వివాదమై అల్లూరి జిల్లాలో గిరిజన సంక్షేమ పాలనా వ్యవహారాలు గందరగోళంగా మారి గత వైసీపీ ప్రభుత్వ పోకడలనే తలపిస్తున్నాయి.

పాడేరులో అక్కడి వైసీపీ ఎమ్మెల్యే చేసిన ఫిర్యాదు నేపథ్యంలో డీడీని రంపచోడవరం బదిలీ చేశారు. సాధారణంగా ఐటీడీఏలకు ఛైర్మన్‌గా ఉండే కలెక్టర్లు తీసుకునే నిర్ణయాలను గిరిజన సంక్షేమ డైరెక్టర్లు సమర్థిస్తూ పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటారు. ఇక్కడ మాత్రం కలెక్టరు ఉత్తర్వులతో బాధ్యతలు నిర్వర్తిస్తున్న డీడీని తప్పించి ఓ సహాయ అధికారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడమే వివాదానికి కారణమైంది. ఈ నేపథ్యంలో అల్లూరి జిల్లాలో రెండు ఐటీడీఏలకు అనుబంధంగా కీలకమైన గిరిజన సంక్షేమ డీడీ పోస్టులను గ్రూప్-1 స్థాయికి తగ్గించేశారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. తమ స్థాయి కంటే దిగువన ఉండే సహాయ గిరిజన సంక్షేమాధికారులకు డిప్యూటీ డైరెక్టర్ బాధ్యతలు అప్పగించడమేమిటని పలువురు ప్రధానోపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. సీనియర్లైన తమను కాదని జూనియర్లకు బాధ్యతలు ఎలా అప్పగిస్తారని మరికొందరు సహాయ గిరిజన సంక్షేమాధికారులు విమర్శిస్తున్నారు. ఇంకొందరైతే న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు.

పింజరికొండ గ్రామానికి బ్రిడ్జి మంజూరుకు చర్యలు

అడ్డతీగల మండలంలో శిశువుతో కలిసి బాలింత ఏరు దాటిన ఘటనపై స్పందించిన ప్రభుత్వం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజవొమ్మంగి, అక్టోబరు 3: అడ్డతీగల మండలంలో గత నెలలో గిరిజన బాలింత శిశువుతో కలిసి ప్రమాదకరంగా ఏరు దాటిన ఘటనపై ప్రభుత్వం స్పందించింది. రాజవొమ్మంగి మండలంలోని గింజర్తి గ్రామంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి గురువారం పాత్రికేయులతో మాట్లాడుతూ గిరిజనులు ప్రమాదకరంగా వాగులు దాటి ప్రాణాలు కోల్పోతున్నా గత పదేళ్లుగా ఎవరూ స్పందించట్లేదన్నారు. పింజరికొండ గ్రామానికి వెళ్లేందుకు బాలింత, శిశువును కుటుంబీకులు తీసుకుని ప్రమాదకర స్థితిలో వాగు దాటుతున్న వైనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిలకు తెలియజేయడంతో వారు వెంటనే స్పందించారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.81లక్షలతో అంచనా కాపీని ఇప్పటికే సిద్ధం చేశామని ఎమ్మెల్యే శిరీషదేవి తెలిపారు. ఈ ఘటన జరిగిన గ్రామం ఎమ్మెల్సీ అనంతబాబు సొంత మండలంలోనిది అన్నారు. అయినా గత ప్రభుత్వం దృష్టి సారించలేదన్నారు.

ఏజెన్సీ సమాచారం



వేదికపై నృత్యం చేస్తున్న అరుణోదయ కళాకారులు

'మోదీ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి'

రంపచోడవరం, అక్టోబరు 3: అటవీ సంరక్షణ నియమాలు-2022, ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై దాడి చేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకురాలు పి.టాన్యా పీడిత ప్రజానీకానికి పిలుపునిచ్చారు. గురువారం ఆర్పీ ఫంక్షన్ హాలులో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. టాన్యా మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా అరుణోదయ పీడిత ప్రజల గొంతు ప్రజా ఉద్యమాలకు అండగా పని చేస్తోందన్నారు. జల్, జంగిల్, జమీన్‌కై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తొలుత గురుకుల కళాశాల గేటు నుంచి అంబేడ్కర్ సెంటరు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం నిర్మించారు. అరుణోదయ రాష్ట్ర నాయకులు వి.భీమశంకర్, ఐ.బాలు, వి.శాంతి, ఎం.కూర్మారావు, ధర్మారెడ్డి, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి కె.దూలన్న, పీవోడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అపనూయ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.చిట్టిబాబు, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఐవీ రమణ, కె.బాలురెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి డి.నాగరాజు, కొండ్ల భానుప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల పక్షపాతి 'ఏచూరి'



కూనవరం, అక్టోబరు 3: గిరిజనులు, పేద, బడుగు, బలహీన వర్గాలు, పోలవరం నిర్వాసితుల కోసం సీతారాం ఏచూరి నిరంతరం పోరాటం చేశారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఉదయభాస్కర్ ఫంక్షన్ హాలులో గురువారం జరిగిన సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడారన్నారు. కూనవరంలో ఆయన చివరి బహిరంగ సభ జరిగిందన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు సీతారాం, టీడీపీ నాయకుడు ఎడవిల్లి భాస్కరరావు, సీపీఐ డివిజన్ కార్యదర్శి గుజ్జా మోహనరావు, వీఆర్ పురం ఎంపీపీ కారం లక్ష్మి, జనసేన నాయకులు సాంబశివ, హేమంత్, టీడీపీ నాయకులు గడ్డిపాటి ప్రసాద్, పూనెం సత్యనారాయణ, పాయం సీతారామయ్య, బొప్పన కిరణ్, యర్రంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల నివేదికలు సమర్పించాలి: ఐటీడీఏ పీవో

రంపచోడవరం, అక్టోబరు 3: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన నివేదికలు సమర్పించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఏడు మండలాల ఎంపీడీవోలు, ఉపాధి హామీ, గిరిజన సంక్షేమం, గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు లింగ్ రోడ్లు, జన్‌మన్ పథకం ద్వారా పీవీటీజీలకు మంజూరైన గృహాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. స్పెషల్ మైనర్ ఇరిగేషన్ శాఖ ద్వారా కొత్తగా సాగునీటి చెక్ డ్యామ్‌లు ఎన్ని గుర్తించారు, ఇంకా మరమ్మతు చేయించాల్సిన పనులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికలను ఈ నెల 14వ తేదీలోగా సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో (జీ) డీఎన్వీ రమణ, మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ జాన్ రాజ్, ఉపాధి ఏపీడీ జి.శ్రీనివాసరావు, పీఎల్‌వో ఎల్.రాంబాబు, ఈఈలు ఐ.శ్రీనివాసరావు, రవి కుమార్, ఎంపీడీవోలు హరికృష్ణ, వీరకిషోర్, మడకం బాపన్నదొర, యదగిరి, ఈశ్వరరావు, ఈవోపీఆర్డీ జాన్‌మిల్టన్, డీఈఈలు చైతన్య, గౌతమి, సాయి సతీష్, రామచంద్రమూర్తి, శ్రీనివాసరావు, స్వామి, శివ, ఉపాధి హామీ ఏపీవోలు, సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శ్రీదేవి శరన్నవరాత్రులు ప్రారంభం



మోతుగూడెం, అక్టోబరు 3: స్థానిక లక్ష్మీగణపతి ఆలయంలో కనకదుర్గ అమ్మవారి మూలవిరాట్‌కి తెల్లవారుజాము నుంచి సమస్త నదీ జలాలతో, పసుపు, కుంకుమలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి నానావిధ పరిమళ పుష్పాలతో పూజించారు. విఘ్నేశ్వర పూజ మొదలుకొని నవగ్రహ మండప ఆరాధన చేసిన తర్వాత ఉత్సవమూర్తిని ప్రాణ ప్రతిష్ఠ చేశారు. మంత్రపుష్పం, కుంకుమ పూజ జరి పారు. సాయంత్రం మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేశారు. నవరాత్రుల్లో మొదటి రోజు స్వర్ణకవచాలంకృత దుర్గాదేవి అమ్మవారికి అష్టోత్తర శతనామావళి, దేవీఖడ్గమాల స్తోత్రాలతో ప్రధానార్చకుడు పవన్‌స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. నవరాత్రులు పూజా ఖర్చును విగ్రహ దాత, ఆలయ ధర్మకర్త జంగా శ్రీనివాస్, జంగా కిషోర్ దంపతులు ఇచ్చారు. ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీరు చిన్న కామేశ్వరరావు దంపతులు, యూనియన్ బ్యాంకు మేనేజరు విత్తనాల సత్యనారాయణ దంపతులు పూజల్లో కూర్చున్నారు. సర్పంచ్ ఆకేటి సీత, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, గ్రామస్థులు, జెన్‌కో ఉద్యోగస్తులు పాల్గొన్నారు.



వరరామచంద్రాపురం: స్థానిక ఇందిరా సెంటర్లోని విఘ్నేశర స్వామి ఆలయంలోను, వీడియో బజారులోను, వీఆర్ పురం ప్రధాన రహదారిలోను, వడ్డిగూడెం, రేఖపల్లి తదితర గ్రామాల్లో కనకదుర్గ అమ్మవారి ఉత్సవ విగ్రహాలను అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేం దుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నారు.



ఎటపాక: తోటపల్లి, గన్నవరం, నందిగామ, చోడవరం, గుండాల గ్రామాల్లో ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించారు. తోటపల్లి శ్రీఆదిత్య పాఠశాల ఆవరణలో తొలి రోజు పూజల్లో సీఐ కన్నప్పరాజు పాల్గొన్నారు. అమ్మవారికి వస్త్రాలు, గాజులు సమర్పించారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, నిర్వాహకులు కడియాల వెంకట్ (ఆదిత్య పాఠశాల కరస్పాండెంట్), నలజాల రాకేష్, ముమ్మనేని వంశీ, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

'సత్యసాయి' సిబ్బంది సమ్మె బాట

దేవీపట్నం, అక్టోబరు 3: మండలంలోని శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లై మెయింటెనెన్స్ వర్కర్స్ 16 నెలలుగా వేతనాలు అందని కారణంగా రూరల్ వాటర్ సప్లై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆఫీసు ఎదుట నిరవధిక సమ్మెకు దిగారు. 16 నెలలుగా వేతనాలు లేక 20 రోజుల క్రితం రెండు రోజులు ధర్నా నిర్వహించగా ఎటువంటి స్పందన రాకపోవడంతో మళ్లీ సమ్మె బాట పట్టాల్సి వచ్చింది. ఈ కారణంగా మండలంలోని పలు గ్రామాలకు గోదావరి తాగునీరు అందదని అధ్యక్షుడు కట్టుమూరి వీరబాబు తెలిపారు. 16 నెలల జీతాలు పెండింగులో వున్నాయని, రెండు సంవత్సరాలుగా ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించట్లేదన్నారు. వేతనాలను పాత పద్ధతిలో బ్యాంకు ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జనరల్ సెక్రటరీ యు.ఇసాక్ కోరారు. సీఐటీయూ నాయకుడు పూర్ణిమరాజు, యూనియన్ నాయకులు శ్రీనివాసులు, మల్లేశ్వరరావు, పి.శ్రీనివాస్, జె.సురేష్, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేత

వరరామచంద్రాపురం, అక్టోబరు 3: మండలంలోని వడ్డిగూడెం గ్రామానికి చెందిన బండి నాగలక్ష్మి అనారోగ్యంతో విజయవాడలోని హెచ్‌సీజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ జోడి నాగేశ్వరరావు గురువారం అక్కడకు వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేశారు.

నేడు నిడదవోలులో జాబ్‌మేళా

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 3: నిడదవోలు ఎస్వీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి హరిశ్చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యఅభివృద్ధి అధికారి గంటా సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్‌కు జ్యోతిలు తెలిపారు. ఈమేరకు గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జాబ్ మేళాలో 3 కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఎస్ఎస్‌సీ, డిప్లొమా, డీబీ ఫార్మసీలు, ఇంటర్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఫార్మసీ విద్యార్హతలు గల అభ్యర్థులు 19 నుంచి 39 ఏళ్ల వారు అర్హులన్నారు. ఉదయం 10 గంటలకు సర్టిఫికేట్లతో హాజరుకావాలని కోరారు.

ప్రజలందరిపై కనక దుర్గమ్మ ఆశీస్సులు ఉండాలి



కోరుకొండలో రాజరాజేశ్వరి అమ్మవారు, బిక్కవోలులో రాజరాజేశ్వరిదేవి, బాలత్రిపురసుందరి

- అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే వాసు
- ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

రాజమహేంద్రవరంకల్చరల్/సిటీ, అక్టోబరు 3: లోకాన్ని కాపాడే కనక దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆకాంక్షించారు. స్థానిక 29వ డివిజన్లో టీడీపీ నగర అంగన్‌వాడీ కమిటీ అధ్యక్షురాలు బోను ఈశ్వరి ఆధ్వర్యంలో కొత్తపేట పెద్దవీధి ఫ్రెండ్స్ సర్కిల్ సారథ్యంలో 8వ శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై దసరా ఉత్సవాలను ప్రారంభించగా, కూటమి నాయకులు గన్ని కృష్ణ, చల్లా శంకరరావు, అత్తి సత్యనారాయణ, కాశి నీన్‌కుమార్, మజ్జి రాంబాబు, రెడ్డి మణేశ్వరరావు, బుడ్డిగ రాధ, ఉప్పులూరి జానకి రామయ్య, కడియాల వీరభద్రరావు అమ్మవారిని దర్శించుకున్నారు.

దేవీచౌక్ అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ పురందేశ్వరి

దేవీచౌక్ దసరా ఉత్సవాల్లో రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. గురువారంరాత్రి ఆలయకమిటీ, పండితులు ఎంపీకి స్వాగతం పలికారు. అమ్మవారికి పురందేశ్వరి ప్రత్యేక పూజలు చేశారు.

● రాజమహేంద్రవరంలో పలు డివిజన్లలో జరుగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ పాల్గొన్నారు. గురువారం స్థానిక కేవీఆర్ స్వామిరోడ్డులోని, కొత్తపేటలోని, కోటిపల్లి బస్టాండ్, 49వ డివిజన్‌లోని శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు స్థానిక మంగళవారపుపేట కొబ్బరికాయల మార్కెట్ దగ్గర శ్రీ విఘ్నేశ్వర రాధాకృష్ణ సహిత కనకదుర్గమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాజమండ్రి పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదతరులు గురువారం ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెంకే సురేష్ మాట్లాతూ 2003లో తమ కుటుంబ సభ్యులు నిర్మించిన ఈ ఆలయాన్ని అమ్మవారి అనుగ్రహంతో ఉత్సవాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కిల్లంపల్లి రాజు, అరిపుల్లాఖాన్, కర్రి శ్రీను, దాసరి రాజు పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులోని జువ్వలదొడ్డిలో వున్న శ్రీరాజరాశ్వేరి పీఠంలో దైవజ్ఞ దేవరభొట్ల ప్రభాకరశర్మ ఉదయం కలశస్థాపన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అవతారంలో దర్శనమిచ్చారు. కరణం గారి మేడలో వున్న శ్రీరామ విలాస ధర్మ సంస్థ నందు పొండర్ ఫ్యామిలీ మెంబర్ అవసరాల కుమార సుదర్శన వేంకటచలపతిరావు అమ్మవారికి కలశ స్థాపన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. గ్రామంలోని ప్రాచీన గోలింగేశ్వర స్వామి ఆలయంలో ఘనం గా దసరా ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, సత్యనారాయణశర్మలు పార్వతి అమ్మవార్ని బాలా త్రిపురసుందరిదేవి అవతా రం అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ ఈవో ఆకెళ్ల భాస్క ర్ భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆరికరేవుల గ్రామంలో సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి, జనసేన మండలపార్టీ అధ్యక్షుడు ఇందల వీరబాబు ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ప్రారంభించారు.

గోకవరం: గోకవరంలోని వీరభద్రునిగడ్డెలో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో గురువారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమి చ్చారు. ఆలయ అర్చకులు కుమారశర్మ, మూర్తిశర్మల ఆధ్వర్యంలో వాకచర్ల సురేష్ దంపతులచే అమ్మవారి కలశస్థాపనతో పూజలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాన్ని గ్రామస్థుడు పసు మర్తి విజయ్‌కుమార్ దంపతులచే పుష్పాలంకరణ చేశారు. ఆర్యవైశ్యయూత్ సభ్యులు సుమారు 12కేజీల లడ్డూని అమ్మవారికి అందించారు.

రాజానగరం: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో దేవీ ఆలయాల తోపాటు ప్రత్యేక మండపాల్లో దుర్గామాతకు ప్రత్యేక పూజులు, అర్చనలు నిర్వహించారు. చక్రద్వార బంధం దేవీచౌక్ 32వ వార్షికోత్సవంలో భాగంగా తొలిరోజైన గురువారం అమ్మవారు స్వర్ణ కవచాలంకరణ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక భక్తులు ప్రగడ రాజు దంపతులచే గ్రామ పురోహితులు భవానీభట్ల సుబ్రహ్మణ్యం శర్మచే అమ్మవారి కలశస్థాపన క్రతువును నిర్వహించారు. గ్రామంలో నూత నంగా నిర్మించిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మొదటి శరన్నవరాత్రి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. తాటికొండ ప్రియతమ, లలిత దంపతులచే అమ్మవారి కలశస్థాపన జరిగింది. జాతీయ రహదారిని ఆనుకుని సూర్యారావు పేట సమీపంలో దుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. రాజానగరంలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలోనూ, కానవరం, తోకాడ, పల్లకడియం, పరిజెల్లిపేట, నందరాడ, నరేంద్రపురం, వెలుగుబంద, రాధేయ పాలెం, మల్లంపూ డి, ముక్కినాడ తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజానగరానికి చెందిన కిరాణా వర్తకుడు మాతంశెట్టి శ్రీరామ్ దంపతులు స్థానిక శివాలయ ప్రాంగణంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి ఇత్తడి మకర తోరణం బహూకరించారు.

రంగంపేట: మండలంలో శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభించారు. రంగంపేట మండలం వడిశలేరు గ్రామంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవింద్ ఆయా మండలాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండ, కాపవరం సెంటర్‌లో గల రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంవద్ద అన్నపూర్ణ సమేతవిశ్వేశ్వర స్వామి ఆలయంవద్ద, జంబుపట్నం ఉమామహేశ్వరస్వామి ఆలయం వద్ద, నర్సాపురం, గాదరాడ ఓం శివశక్తిపీఠం నందు, దోసకాయలపల్లి, గాడాల,బూరుగుపూడి, కోటికేశవరం, రాఘవాపురం శ్రీరంగపట్నం గ్రామాల్లో ప్రారంభమయ్యాయి.

కడియం: కడియపులంక హరిహర మహాక్షేత్రంలో ఉన్న శ్రీఅపర్ణాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయధర్మకర్తల మండలి చైర్మన్ మార్గాని సత్యనారాయణ ఆధ్వర్యంలో కమిటీ సహకారంతో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కర్రి వెంకటేశ్వరరావు, నాగమణి దంపతులు కలశపూజ నిర్వహించారు.

స్ర్కీన్‌పై పవన్ కళ్యాణ్ వారాహి డిక్లరేషన్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్యమైదానంలో స్ర్కీన్‌పై పవ న్ కళ్యాణ్ వారాహి డిక్లరేషన్ దృశ్యాలను ప్రదర్శించారు. తిరుమల శ్రీవారి ఆశీస్సులతో తిరుపతిలో వారాహి సభావేదికగా సనాతన ధర్మ పరిరక్షణ కోసం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన వారాహి డిక్లరేషన్ కార్యక్రమ ప్రత్యేక ప్రసారాన్ని గురువారం రాత్రి రాజమహేంద్రవరంలో జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. దీనిని జనసైనికులు, నగర కమిటీ సభ్యులు, అభిమానులుతిలకించారు.

ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

● బీజేపీలో చేరికల కార్యక్రమంలో ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 3 : రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాజధాని అమరావతి నిర్మాణంతోపాటు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి సహాయ సహకారాలు అందజేస్తామని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని బీజేపీ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎంపీ పురందేశ్వరి సమక్షంలో న్యాయవాది, సామాజిక సేవకురాలు విజయ చీలి, ఆమెతోపాటు పలువురు బీజేపీ పార్టీలో చేరారు. ఎంపీ పురందేశ్వరి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎన్‌సీసీ దోహదం

రాజానగరం: విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ దోహదపడుతుందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరిజిల్లా రాజానగంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎయిర్ కమోడోర్ వీఎం రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపు (ఎన్‌సీసీ) (ఏపీఅండ్‌టీ) ఎస్ఎన్ఐసీ కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మనదేశంలో వైవిధ్యం, భిన్నత్వంలో ఏకత్వం అంశాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎన్‌సీసీ బృందాలు బాధ్యతతో వ్యవహరించడమే కాకుండా సహాయ కార్యక్రమాలతో ప్రజలను రక్షించి వారికి అండగా నిలుస్తాయన్నారు. ఇటీవల విజయవాడలో వరద ముంపు ప్రాంతాల్లో ఎన్‌సీసీ బృందాల సహాయక చర్యలను మనం గమనించామన్నారు.

●గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం నూతనంగా రూపొందించిన వెబ్‌సైట్‌ను ఎంపీ పురందేశ్వరి ప్రారంభించారు. జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు, కల్నల్ ఆర్ఎం అగర్వాల్, కాకినాడ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమోడోర్ వీఎం రెడ్డి, జీజీయూ ఉపకులపతి చంద్రశేఖర్, రిజిస్ట్రార్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళల రక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● మీ భద్రత-మా బాధ్యతలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు3: మహిళల రక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారంరాత్రి రాజేంద్రనగర్‌లో టీఎన్‌టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు నక్కా చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన మీ భద్రత-మా బాధ్యత సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టవేశామన్నారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వరప్రసాద్, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాదా, చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు పాల్గొన్నారు.



మీ భద్రత -మా బాధ్యతలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

పుష్కరాలనాటికి సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతా

పుష్కరాల నాటికి రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేసి సమస్యలులేని నగరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం 11వ డివిజన్ మల్లిననగర్‌లో కూటమి నాయకులతో కలిసి పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మించాల్సిన ప్రదేశాల గురించి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. విద్యుత్ ఓల్టేజీ సమస్య ఉన్నట్లు తెలుసుకుని విద్యుత్‌శాఖ అధికారులకు సమస్య పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ కూటమి నాయకులతో కలిసి నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సమష్టి బాధ్యత: ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు, అక్టోబరు 3 : గ్రామాభివృద్ధికి గ్రామసభ ద్వారా సమిష్టి బాధ్యత తీసుకోవడం సంతోషదాయకమని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రాజానగరం మండలం పుణ్యక్షేత్రంలో గురువారం జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్నిరంగాలలో నిర్వీర్యం అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దానిని సరిచేసే విషయంలో పాలకులు, అధికార్లుతోబాటు ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. గ్రామసభద్వారా కొత్తపనులను, పుంతరోడ్లు, సీసీ రోడ్లు, డ్రైన్లు, చెరువులు ఆధునీకరణ, కాలువల మరమ్మతులు, మంచినీటి సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. సమావేశంలో తహసీల్దారు లక్ష్మీలావణ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ టివి.సుబ్బారావు, సర్పంచ్ వెంకటేశ్వరరావు, కూటమినాయకులు మద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, పేపకాయలవిష్ణుమూర్తి, బాబులు, రాజు పాల్గొన్నారు.

నిలిచిన సత్యసాయి మంచినీటి విడుదల

సీతానగరం, అక్టోబరు 3: మండలంలోని పురుషోత్తపట్నం లోని శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు సిబ్బంది నిరవధిక సమ్మె చేపట్టడంతో సత్యసాయి మంచినీటి పథకం ప్రాజెక్టు నుంచి మంచినీటి విడుదల నిలిచిపోయింది. శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ మెయింటినెన్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కట్టమూరి వీరబాబు ఆధ్వర్యంలో 53 మంది సిబ్బంది నిరవధిక సమ్మె ప్రారంభించారు. దీంతో సీతానగరం, కోరుకొండ, గోకవరం, దేవీపట్నం, రాజానగరం మండలాలలోని 80 గ్రామాలకు తాగునీరు నిలిచిపోయింది. జీతాలు అందక అధికవడ్డీలకు అప్పులుచేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని వీరబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమకు రావలసిన 16 నెలల జీతాలు తక్షణమే అందించాలన్నారు.

'జీతాలు ఇవ్వకపోవడం అన్యాయం'

రాజమహేంద్రవరంఅర్బన్, అక్టోబరు 3: గ్రామీణనీటి సరఫరా విభాగంలోని సత్యసాయి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు 16నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీఎన్ పూర్ణిమరాజు అన్నారు. గురువారం లాలాచెరువు ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో పనిచేస్తున్న 50 మంది సిబ్బందికి జీతాలు ఇవ్వడంలేదని, పీఎఫ్ ఖాతాలు తెరిచినా వాటిలో డబ్బులు జమ చేయడంలేదని అన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీరి సమస్యలపై స్పందించి కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ప్రైవేట్ హాస్పటల్స్ యూనియన్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, కట్టమూరి వీరబాబు, ఇస్సాకు, రామకృష్ణ పాల్గొన్నారు.

గర్భిణులపై నిర్లక్ష్యం

● అర్ధరాత్రి దాటాక చేతులెత్తేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది



గర్భిణుల సమస్యలను ఎమ్మెల్యే సమక్షంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వివరిస్తున్న బాలింతల తల్లులు

అనపర్తి, అక్టోబరు 3: అనపర్తి ఏరియా ఆసుపత్రిలో ఇటీవల డెలివరీకి వచ్చిన గర్భిణుల విషయంలో అక్కడి వైద్యులు వహిస్తున్న నిర్లక్ష్య ధోరణి బయటకు వస్తున్నాయి. ఒక్కరోజు వ్యవధిలో ఇద్దరు గర్భిణులను అర్ధరాత్రి సమయాల్లో తమవల్ల కాదని పెద్దాసుపత్రికి తీసుకువెళ్ళండని అక్కడి వైద్యులు చేతులు దులుపుకోవడంతో చేసేది లేక అనపర్తిలోనే ప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయించిన ఇద్దరు బాలింతలు చెప్పిన విషయాలు వింటే గుండె చివుక్కుమనక మానదు. వివరాల ప్రకారం అనపర్తిలోని ఏరియా ఆసుపత్రికి సోమవారం ఉదయం వినీత అనే గర్భిణీ ప్రసవం కోసం వచ్చింది. ఆమెకు కనీసం గదిని కూడా కేటాయించని సిబ్బది ఆ టెస్టు ఈ టెస్టు అంటూ మధ్యాహ్నం వరకు బయటే ఉంచారు. కొన్ని మందులు కావాలని అవి బయట నుంచి తెచ్చుకోవాలని సూచించడంతో గర్భిణీ తల్లి వారు చెప్పిన మందులను తీసుకొచ్చి ఇచ్చింది. చివరకు నొప్పులు ప్రారంభం కావడంతో పెద్ద డాక్టరును పిలిపించాలని కోరినప్పటికీ ఆమె మాటను వినేవారు లేకపోయారు. చివరకు అర్ధరాత్రి దాటాక ప్రసవం ప్రారంభం కావడం గర్భంనుంచి కొంత మేర తలభాగం బయటకు రావడంతో ఆమె తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ ఎవరూ కనికరించలేదు. ఇప్పటికైనా పెద్ద డాక్టర్‌ను పిలవాలని కోరినా ఆమె వచ్చినా చేసేది లేదని ఆపరేషన్ చేయాలంటే మత్తు వైద్యులు కావాలని రేపు ఉదయం వరకు ఎవరూరారని మీరు కాకినాడ కానీ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లండని సలహా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కనీసం అంబులెన్స్ ఏర్పాటుకు కూడా సిబ్బంది సహకరించకపోవడంతో అర్ధరాత్రి 2గంటల సమయంలో సగం డెలివరీతో ఉన్న ఆమెను తీసుకుని స్థానికంగా ఉన్న ప్రైవేటు వైద్యులను ఆశ్రయించడంతో అక్కడ ఆమెకు అత్యవసరంగా ఆపరేషన్ నిర్వహించి తల్లీబిడ్డలను కాపాడారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గురువారం ప్రయివేటు ఆసుపత్రికి చేరుకుని అక్కడ చికిత్స పొందు తున్న ఇరువురు బాలింతలను పరామర్శించి ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన పరిస్థితు లను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా వెంటనే ఏరియా ఆసుపత్రి సూపరిండె ంట్ డాక్టర్ రామగుర్రెడ్డిని ప్రైవేటు ఆసుపత్రికి పిలిపించి బాధితులతో పరిస్థితిని మాటల్లో అయనకు వినిపించారు. అనతరం ఫోన్‌లో డీసీహెచ్ఎస్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే శుక్రవారం ఉదయం ఆసుపత్రిలో వైద్యులు సిబ్బందితో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు.

పరిశుభ్రతపై నిర్లక్ష్యం వద్దు: పీసీఎండీ

రాజమహేంద్రవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్(పీసీఎండీ) వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆయన గురువారం రైల్వేస్టేషన్‌లోని పరిశుభ్రతను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. స్వచ్ఛతా హీ సేవను నిర్వహించారు. స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్నారు. సఫాయ్ వాలాలకు సక్రమంగా జీతాలు అందకపోవడం రైల్వేస్టేషను, ప్రాంగణంలో పరిశుభ్రతపై ప్రతికూల ప్రభావం చూపుతోందని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆర్పీఎఫ్ స్టేషన్ పక్కనే చెత్తను నిల్వచేసి తరలించడంలేదని స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ పీసీఎండీకి చెప్పగా డీఆర్ఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ శౌర్యబాల, సీనియర్ మెడికల్ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, ఎస్ఎంఆర్ రంగనాథ్, సీటీఐ చంద్రమౌళి, ఐవోడబ్ల్యు వల్లి, ఎస్ఎస్ సురేంద్ర, బీజేపీ నాయకు లు యానాపు యేసు పాల్గొన్నారు.

జీజీహెచ్ ఎదుట దివ్యాంగుల ధర్నా

● పెన్షన్ దరఖాస్తులు తీసుకోవడంలేదంటూ నిరసన, అధికారుల హామీతో విరమణ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 3 : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్) ఎదుట గురువారం పలువురు దివ్యాంగులు ధర్నాకు దిగారు. రూ.15,000ల పెన్షన్ సదరం సర్టిఫికెట్ల కోసం వచ్చిన తమకు సరైన సౌకర్యాలు కల్పించడంలేదని, ఆసుపత్రి సిబ్బంది తమ దరఖాస్తులను తీసుకోవడంలేదని జీజీహెచ్ ప్రధాన భవనం ఎదుట కొంతసేపు ధర్నా చేశారు. దరఖాస్తులు తీసుకోకపోవడంతోపాటు వీల్‌చైర్లు సమకూర్చడంలేదని ఆందోళన చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. జీజీహెచ్ వద్ద కొంత సేపు అలజడి నెలకొంది. దివ్యాంగుల ఆందోళనతో అప్రమత్తమైన ఆసుపత్రి అధికారులు అక్కడకు చేరుకుని వారితో మాట్లాడారు. అధికారుల హామీతో దివ్యాంగులు ఆందోళన విరమించారు. ఈ గురువారం దివ్యాంగులు పెద్దసంఖ్యలో జీజీహెచ్‌కు తరలివచ్చారు.

కోటపాడులో గుట్టుగా ఇసుక అక్రమ రవాణా

రంగంపేట, అక్టోబరు 3: మండలంలో కోటపాడు గ్రామ శివారులో బీఎస్సార్ కంపెనీ ప్లాంట్ దగ్గర్లో గుట్టుగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు. సామర్లకోటకు చెందిన ఓ బడా కాంట్రాక్టర్ అధికారుల కళ్లుగప్పి ఈ అక్రమ వ్యవహారాన్ని నడిపిస్తున్నాడు. ఎలాంటి పత్రాలు లేకుండా టిప్పర్లు లారీల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా గవర్నమెంట్ వర్క్ కోసం గత ప్రభుత్వంలో సేకరించిన ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఏడీబీ రోడ్డు పనుల కోసం కేటాయించిన ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో బిల్లులు రాక రోడ్డు పనులు నిలిచిపోవడంతో వినియోగించకుండా ఉన్న గోదావరి ఇసుక సుమారు 800 ట్రిప్పులు వరకు ఉన్న ఇసుక గుట్టను ఖాళీ చేసేస్తున్న అక్రమార్కులు. ఇప్పటికైనా అధికారులు ఈ అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కడియపులంక మహిళా సంఘాలపై విచారణ

కడియం, అక్టోబరు 3: కడియం మండలం కడియపులంక గ్రామపరిధిలో స్వయం సహాయక సంఘాల్లో వివిధ బ్యాంకులు మంజూరు చేసిన బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి నిధులలో అవకతవకలు జరుగుతున్నాయని వాటిని తనిఖీచేసి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కడియపులంక ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, సంఘాల సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్వీవీఎస్ మూర్తి 15 మంది అధికారుల బృందాన్ని విచారణకు నియమించారు. కడియపులంక పంచాయతీ మహిళా సంఘాలను విచారించి తగు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈమేరకు డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్వీవీఎస్ మూర్తి మాట్లాడుతూ కడియపులంక మహిళా సంఘాలపై 15మంది బృందం విచారణ చేస్తారన్నారు. అవకతవకలు జరిగినట్లు గుర్తిస్తే వారి నివేదిక ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'సాంకేతిక పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు'

రాజమహేంద్రవరంరూరల్, అక్టోబరు 3: రైతులకు వ్యవసాయంలో ఎప్పటికపుడు నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులను తెలియచేయడం ద్వారా రైతులు నాణ్యమైన దిగుబడులు పొందేలా కృషిచేస్తామని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తెలిపారు. రూరల్ మండలం వెంకటనగరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంట దిగుబడులు తగ్గడానికి కారణాలు తెలుసుకుని సూక్ష్మపోషక లోపాలు గుర్తించి తద్వారా సారాన్ని పెంచేలా 50 శాతం రాయితీపై సూక్ష్మపోషకాలు అందిస్తామన్నారు. రూరల్ మండలం పరిధిలో నూరుశాతం ఈకేవైసీ పూర్తి చేసినందుకు అధికారులను అభినందించారు. పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ మాట్లాడుతూ మినీగోకులం, లేగదూడలకు టీకాలు వేయించుకోవాలన్నారు. డ్రిప్ ఇరిగేషన్ అందిస్తామని ఉద్యాన అధికారి సు ధీర్ తెలిపారు. ఏవో బీమరాజు, ఏడీ శ్రీనివాసరెడ్డి, ఏఈవో జాన్‌పీటర్‌లు పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టండి'

రాజమహేంద్రరం సిటీ, అక్టోబరు 3: ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలని డివిజనల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమి టీ సభ్యుడు గొల్లిముక్కల అనంతరావు విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కృష్ణనాయక్‌ను గురువారం అనంతరావు మర్యాదపూర్వకంగా కలిశారు. నాయక్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో సమస్యలపై చర్యలు తీసుకుంటానన్నారు.







దేవీ వైభవం!

దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం జిల్లావ్యాప్తంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రధానంగా రాజమహేంద్రవరంలోని దేవీచౌక్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రత్యేక పూజలతో అత్యంత ఘనంగా మొదలయ్యాయి. ఆ దృశ్యాలే ఇవి. (పక్కన) ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన నిడదవోలులోని కోట సత్తెమ్మ అమ్మవారు

ఇసుక డ్రెడ్జింగ్‌లోనూ గోల్‌మాల్!



- వైసీపీ హయాంలో ఇదో మాయాజాలం
- దోచేసింది ఒకరు.. మధ్యలో ఇంకొకరు
- రూ.50 కోట్ల బిల్లు చెల్లించాలని ప్రభుత్వానికి లేఖలు
- బోట్స్‌మన్ సొసైటీలకు రూ.30 లక్షల బాకీతో పరారీ
- బాధితులంతా అధికారులపై ఒత్తిడి తెస్తున్న వైనం

వైసీపీ హయాంలో ఇసుక దోపిడీ వర్ణనాతీతం. ఇసుక అమ్మకాలు, డ్రెడ్జింగ్ పేరుతో అనేక కంపెనీల పేరుతో వైసీపీ పెద్దలే నిలువుదోపిడీ చేసేశారు. ఈ అక్రమ వ్యవహారాలు బహిరంగ రహస్యమే అయినా ప్రభుత్వ ఒత్తిడి మేరకు అధికారులూ మౌనం దాల్చారు. చివరకు స్థానిక అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా వారు సాధారణ తనిఖీలకూ వెళ్లలేని దుస్థితి. ఎంతమేర తవ్వుతున్నారు, సరిహద్దులేంటనే అంశాలూ వీరి పరిధిలో లేని పరిస్థితి. అంతా ఉన్నత స్థాయిలోనే వ్యవహారాలు నడిపోయాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ ఆగడాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. ఇసుక కుంభకోణం కూడా బయటకు వస్తోంది. అప్పట్లో గోదావరిలో ఇసుక డ్రెడ్జింగ్ చేయడానికి కాంట్రాక్టు కుదుర్చుకున్న రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీ డ్రెడ్జింగ్ చేయకుండా అక్రమ డ్రెడ్జింగ్‌దార్లకు సహకరించి, ఇవాళ తామే డ్రెడ్జింగ్ చేసినట్టు.. దానికి సుమారు రూ.50 కోట్లు చెల్లించాలంటూ అధికారులకు లేఖలు రాయడం విశేషం. అప్పట్లో ఆర్కే అనే వ్యక్తి గుత్తాధిపత్యం కింద ఇక్కడ అపరిమితంగా డ్రెడ్జింగ్ చేసేశారు. బోట్స్‌మన్ సొసైటీల ద్వారా ఇసుక డ్రెడ్జింగ్ జరిపి.. చివరకు వారికి రూ.30 లక్షలు బాకీ ఉంచి మరీ వెళ్లిపోయారు. దీంతో వాళ్లంతా లబోదిబోమంటున్నారు.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరిలో ఇసుక దిబ్బలు తొలగించి, గోదావరిలో బ్యారేజీ లోపల నీరు ఎక్కువ నిల్వ ఉంచాలనే ఆలోచన గతంలోనూ ఉంది. 2014- 2019 మధ్య టీడీపీ ప్రభుత్వం డ్రెడ్జింగ్ చేయించి పిచ్చుకలంకను మెరకచేసింది. డ్రెడ్జింగ్ అంటే డ్రెడ్జరును గోదావరిలోకి తీసుకుని వెళ్లి, దాని గొట్టాలను గోదావరి గట్టు మీద ఇసుక గుట్ట వేయాల్సినచోటు వరకూ అమర్చి ఇసుకను తోడేస్తారు. ఈ ఇసుక నీటితో కలసి ఉంటుంది. కాబట్టి నీరు ఇంకేటట్టు ముందుగానే ఇరిగేషన్ అధికారుల సమక్షంలో ఒడ్డున పాండ్స్ నిర్మిస్తారు. డ్రెడ్జింగ్ చేసిన ఇసుకను ఈ పాండ్స్‌లోకి గొట్టాల ద్వారా పంపిస్తారు. వాటిలో నీరు ఇంకిపోయేటట్టు చేస్తారు. నీరు ఇంకిన తర్వాత ఇసుకను ఇరిగేషన్ అధికారులకు అప్పగించాలి. వారు వేరే కాంట్రాక్టర్‌తో అమ్మించే ప్రయత్నం చేయాలి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇలా పద్ధతి ప్రకారం జరిగింది. అప్పట్లో డ్రెడ్జింగ్ చేసిన కాంట్రాక్టర్‌కు టన్నుకు రూ.119 వరకూ ఇచ్చారు. పిచ్చుకలంక కూడా మెరక అయింది. కొంత ఇసుక బయటకు అమ్మారు. కానీ 2019లో వైసీపీ గెలిచిన తర్వాత ఇసుక విధానాల్లో అనేక దోపిడీ మార్గాలను ఎన్నుకున్నారు. 2022లో మే నెలలో సుమారు 3 కోట్ల టన్నుల ఇసుక మేటలుగా ఉందని అంచనా వేసి, గోదావరి ఎడమగట్టు బ్యారేజీకి దిగువన 3 కిలోమీటర్ల తర్వాత ఫోర్త్‌బ్రిడ్జి వరకూ డ్రెడ్జింగ్ చేయడానికి రూ.144.23 కోట్లతో టెండర్లు పిలించారు. కుడివైపున బ్యారేజీ నుంచి అదే దూరం వరకూ డ్రెడ్జింగ్ చేయడానికి రూ.128.23 కోట్లతో టెండర్లు పిలిచారు. మొత్తం రూ.272.46 కోట్లు. వీటికి మొత్తం మూడు కంపెనీలు టెండర్లు దాఖలు చేశాయి. అందులో రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఒకటి. ఈ కంపెనీకి రాకుండా వేరే కంపెనీ ఈ టెండర్లలో అర్హత సాధించింది. కానీ రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీ వైసీపీ పెద్దలకు కావలసిన వ్యక్తికి సంబంధించిందిగా ప్రచారం జరిగింది. ఆయన అప్పట్లో తెలంగాణ ప్రాంతానికి చెందిన ఓ ఎంపీగా ఉండేవారు. ఇవాళ మంత్రి. వైసీపీ పెద్దలు సదరు కంపెనీకి అర్హత లేకపోయినా అదే కంపెనీకి టెండర్లు ఖరారు చేయాలని ఒత్తిడి చేశారు. అప్పట్లో ధవళేశ్వరం ఇరిగేషన్ ఎస్‌ఈగా ఉన్న రాంబాబు దీనిని వ్యతిరేకించారు. నిబంధనల ప్రకారం అర్హత సాధించిన కంపెనీని కాదని, ఏ అర్హత లేని రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీకి తాము టెండర్లు ఖరారు చేయలేనని ఖరాఖండీగా చెప్పారు. దాంతో ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి తెచ్చింది. ఆయన పట్టించుకోకపోవడంతో ఆకస్మికంగా ఓ ప్రాధాన్యం లేని ప్రాంతానికి బదిలీచేసింది. పోలవరం ప్రాజెక్టులో ఎస్‌ఈగా ఉన్న ఓ అధికారికి ఇన్‌చార్జి ఇచ్చి కథ నడిపించారు. పైగా అప్పట్లో వైసీపీ వర్గాలకు చెందిన నారాయణరెడ్డి అనే ఉన్నతాధికారి కూడా సహకరించారు. పైగా ఈ కంపెనీకి బ్యాంక్ గ్యారంటీలోనూ మతలబు జరిగింది. విదేశాలకు చెందిన యూరో బ్యాంక్‌ను బ్యాంక్ గ్యారంటీగా చూపడం గమనార్హం. ఇలా పనులను రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీకి కట్టబెట్టారు.

● **ఇక్కడా కుట్ర..**

డ్రెడ్జింగ్ పనులను రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీకి కట్టబెట్టిన వైసీపీ పెద్దల బుర్రలలో ఏముందోకానీ, వాళ్లు ఏం చేశారోగానీ ఈ కంపెనీ డ్రెడ్జింగ్ చేయలేదు. గతేడాది అక్టోబరు వరకూ ఇరిగేషన్ అధికారులు వాళ్లకు నోటీసులు ఇస్తూనే ఉన్నారు. వాళ్లు డ్రెడ్జింగ్ మిషన్లు దింపలేదు. పాండ్స్ తవ్వలేదు. తవ్విన ఇసుకను లెక్కించడానికి ఇరిగేషన్ అధికార్లకు బాధ్యత అప్పగించలేదు. కానీ అప్పటికే ఇసుక గుత్తాధిపత్యం సాధించి, డ్రెడ్జింగ్ పడవలతో ఇసుకను ఆర్కే అనే వ్యక్తి దోచేయడం ప్రారంభించారు. దీంతో కొందరు కోర్టుకు వెళ్లడంతో హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా స్పందించాయి. ఈ నేపథ్యంలో వైసీపీ పెద్దలలో భయం కలిగి, వెంటనే మరో మోసానికి ఒడిగట్టారు. అంతవరకూ డ్రెడ్జింగ్ పనిచేయని రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీని ముందుకు తెచ్చారు. వారి పేరుతో ఆర్కే అనే వ్యక్తి సబ్ లీజు కింద బోట్స్‌మన్ సొసైటీలతో కలసి ఇసుక తీయిస్తున్నట్టు కథ అల్లారు. దీనికి తటపటాయించినప్పటికీ చివరకు ఇరిగేషన్ అధికారులు కూడా తలూపకతప్పలేదు. ఈలోగా ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అప్పటివరకూ అక్రమంగా ఇసుక తవ్విన వ్యక్తులు కనిపించకపోయారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన జూన్ 4నే డ్రెడ్జింగ్ పడవలన్నీ అదృశ్యమయ్యాయి. కానీ ఇటీవల రాఘవా కన్‌స్ట్రక్షన్ కంపెనీ తాము సుమారు 32 లక్షల టన్నుల ఇసుక డ్రెడ్జింగ్ చేసినట్టు చెబుతూ తమకు టన్నుకు రూ.150 వంతున రూ.50 కోట్ల వరకూ ఇవ్వాలని అధికారులకు లేఖలు రాయడంతో పెద్ద చర్చనీయాంశమైంది. అప్పట్లో జరిగిన అక్రమాలపై మౌనం వహించిన అధికారులు నెమ్మదిగా వాస్తవాలు చెప్పడం మొదలుపెట్టారు. పైగా డ్రెడ్జింగ్ చేసినట్టు చెబుతున్న కాంట్రాక్టు సంస్థ విదేశాలకు చెందిన యూరో బ్యాంక్‌ను గ్యారంటీ చూపడం, ఆ బ్యాంక్ గ్యారంటీ చెల్లదనే వాదన, ఈడీ కూడా విచారణ చేస్తున్నట్టు తెలియడంతో అధికారులు దృష్టిపెట్టినట్టు సమాచారం. ఇటు బోట్స్‌మన్ సొసైటీలు తమతో ఇసుక తీయించి బకాయి పెట్టడంతో జిల్లా యంత్రాంగం చుట్టూ తిరుగుతున్నాయి. దోచేసింది ఒకరైతే.. పనిచేయకుండా రూ.50 కోట్లు కొట్టేసే ప్రయత్నంలో మరొకరు ఉండగా, పనిచేసిన బోట్స్‌మన్ సొసైటీలు మాత్రం మోసపోయి ఆందోళన చెందుతున్నాయి. ప్రస్తుతం ఉచిత ఇసుక అమలులో భాగంగా ఇసుకతీత మొదలైంది. ఇప్పటివరకూ 44 బోట్స్‌మన్ సొసైటీలకు అనుమతిచ్చారు. కానీ వాటికి పద్ధతి ప్రకారం ఇంతవరకూ ప్రొసీడింగ్ ఆర్డర్లు లేవు. ఎవరు డబ్బులు ఇస్తారో చెప్పలేదు. ఏ సొసైటీకి ఎంత ఇసుక తీత అప్పగించారో స్పష్టత లేదు. గతంలో పనిచేసిన వారికి సంబంధించిన వ్యక్తే మళ్లీ రంగ ప్రవేశం చేస్తున్నాడని, బోట్స్‌మన్ సొసైటీలన్నీ ఆయన చేతిలో పెట్టుకుని, తానే చేసినట్టు ఒక ఏజెన్సీని ఏర్పాటు చేయనున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై స్పష్టత లేక ప్రస్తుతం ఇసుక తీస్తున్నారే కానీ అమ్మకాలు లేవు.

భగ్గుమన్న కూరగాయలు



- బహిరంగ మార్కెట్లో ఒక్కసారిగా భారీగా పెరిగిన ధరలు
- ఏ కూరగాయలైనా కిలో రూ.60 పైనే
- దసరా డిమాండు కారణమంటున్న వెజిటబుల్స్ వర్తకులు
- దీపావళి వెళ్లే వరకూ ఇదే పరిస్థితి అంటూ అంచనా

(రాజమహేంద్రవరం అర్బన్)

కూరగాయల ధరలు బహిరంగ మార్కెట్లో ఒక్కసారిగా భగ్గుమన్నాయి. కేవలం రెండు, మూడు రోజుల వ్యవధిలోనే కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకూ పెరుగుదల కనిపిస్తోంది. వంకాయలు, బీరకాయలు, బెండకాయలు, టమోటా.. ఇలా ఏ రకం కూరగాయలైనా కిలో రూ.60 పైనే ధర ఉంది. కొన్ని రూ.80 కూడా అమ్ముతున్నారు. ప్రత్యేకించి టమోటా, వంకాయల ధరలు రోజు రోజుకూ పైపైకి ఎగబాకుతున్నాయి. టమోటా కిలో రూ.60కు చేరుకుంది. రెండు, మూడు రోజుల వరకూ టమోటా కిలో రూ.40కు విక్రయించేవారు. ఒక్కసారిగా ధర పెరిగింది. వంకాయలు గులాబీ రకం రూ.80కు అమ్ముతున్నారు. డొమ్మేరు వంకాయలు కిలో రూ.60కి పలుకుతోంది. చివరకు బెండకాయలు, దొండకాయలు వంటివి డిమాండు తక్కువగా ఉండే కూరగాయలు కూడా కిలో రూ.60 అమ్ముతున్నారు. కూరగాయల ధరల పెరుగుదలకు వర్తకులు అనేక కారణాలు చెబుతున్నారు. ప్రస్తుతం రైతుబజార్లలోని రైతులు కూడా బయట మార్కెట్ల నుంచే కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. వీరు పండించే పంటలు ఇటీవలి వర్షాలకు పూర్తిగా దెబ్బతినడంతో రంభ-ఊర్వశి, మడికి వంటి హోల్‌సేల్ మార్కెట్ల నుంచే కూరగాయలు తీసుకొచ్చి రైతుబజార్లలో విక్రయిస్తున్నారు. దీపావళి వెళ్లే వరకూ ఈ పరిస్థితి తప్పదనే అభిప్రాయం అటు రైతులు, ఇటు వ్యాపారుల్లోనూ వ్యక్తమవుతోంది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకావడంతో దసరా పర్వదినం రోజుల్లో చాలామంది నాన్‌వెజ్‌కు దూరంగా ఉంటారు. కొంతమంది భవానీ మాలలు ధరిస్తారు. వీరంతా దాదాపుగా రెండు వారాలపాటు చికెన్, మటన్ వంటివి ముట్టుకోరు. దీంతో ఆయా కుటుంబాల్లో వంటలకు కూరగాయలే వినియోగిస్తుంటారు. దీంతో కూరగాయల వినియోగం భారీగా పెరుగుతుంది. కానీ మార్కెట్లో వినియోగదారుల అవసరాలకు తగ్గట్టు కూరగాయలు రావడంలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు కూరగాయల పంటలన్నీ దాదాపుగా తుడిచిపెట్టుకుపోయాయి. స్థానికంగా సీతానగరం, రావులపాలెం, సిద్ధాంతం తదితర లంక ప్రాంతాల్లో సాగుచేసే బెండ, బీర, దొండ, ఆనప, చిక్కుడు వంటి పంటలు ఇప్పుడిప్పుడే మళ్లీ ఊపిరిపోసుకుంటున్నాయి. దిగుబడులు అందుకోవాలంటే మరో రెండు, మూడు వారాలు ఆగాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో హోల్‌సేల్ ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుంటున్నారు. వాటిని స్థానిక వ్యాపారులు చిల్లర మార్కెట్లో విక్రయించేసరికి ధరలు ఆకాశాన్నంటేలా పెరిగిపోతున్నాయి. దీంతో కూరగాయలు కొనాలంటేనే సాధారణ, మధ్యతరగతి ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. ధరలను కొంతైనా నియంత్రించాల్సిన జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు దృష్టిపెట్టకపోవడంతో కూరగాయాలు' ప్రజలకు తప్పేలా కనిపించడంలేదు.

కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ బదిలీ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 3: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న పీఎం సత్యవేణిని విశాఖపట్నం యూడీసీ పీవోగా ప్రభుత్వం బదిలీచేసింది. ఆమె స్థానంలో ఇంకా ఎవరినీ ప్రభుత్వం నియమించలేదు. గురువారం సాయంత్రం ఆమె రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా సత్యవేణికి నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్, అధికారులు వీడ్కోలు పలికారు. ఆమె సేవలను ప్రశంసించారు.

డ్వామా పీడీగా మహేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మహేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు3: తూర్పుగోదావరి డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎ. నాగమహేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. బొమ్మూరులో వైటీసీ ప్రాంగణంలో డ్వామా కార్యాలయంలో ఈయన కృష్ణా జిల్లా డ్వామా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ ఏవో కిషోర్, సిబ్బంది, గ్రామాల ఏపీవోలు స్వాగతించారు. అంతకుముందు డ్వామా పీడీగా బాధ్యతలు స్వీకరించిన నాగమహేశ్వరరావు జిల్లా కలెక్టర్ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఐలకు పోస్టింగ్‌లు

రాజమహేంద్రవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వీఆర్‌లో ఉన్న సీఐలకు స్టేషన్లు కేటాయిస్తూ ఎస్పీ నరసింహ కిషోర్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా వీఆర్‌లో ఉన్న ఎండీ అబ్దుల్‌నబీని ట్రాఫిక్-1, కె.మంగాదేవిని మహిళా పోలీస్‌స్టేషన్, పీఈ పవన్‌కుమార్ రెడ్డిని డీసీఆర్‌బీకి, బి.విజయ్‌శంకర్‌ని వన్‌టౌన్ సీసీఎస్, ఇ.బాలశౌరీని సీసీఎస్-2, వై.రాంబాబుని సీసీఎస్-3, డీసీఆర్బీలో ఉన్న చింతా సూరిబాబును ట్రాఫిక్-2కి బదిలీ చేశారు. నిజాయితీగా ఉన్న కొందరు సీఐలకు మంచి సీట్లు దక్కలేదనే విమర్శలు వినవస్తున్నాయి. ఇక్కడే ట్రాఫిక్‌లో పనిచేసి పలు ఆరోపణలు ఎదుర్కొని విధుల నుంచి తొలగించగా ప్రయత్నాలు చేసుకొని డీసీఆర్బీలో పనిచేస్తున్న సీఐకి మళ్లీ గతంలో పనిచేసిన సీటును ఇచ్చారని, అలాగే 'ట్రై' చేసుకోని వారిని మళ్లీ లూప్ లైన్‌లోకి నెట్టారనే చర్చ జరుగుతోంది. ఉన్నత స్థాయిలో ప్రయత్నాలు చేసుకోవడంతో ఆయా స్థానాలు పొందినట్టు చెబుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

బంగారుకొండ ప్లస్ ద్వారా పోషణ విలువల కిట్లు

గెయిల్ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 3: సామ్-మామ్ మధ్య తేడాలు, పిల్లల ఎదుగుదల సాధారణ స్థితికి తీసుకుని వచ్చే లక్ష్యంలో భాగంగా జిల్లాలో బంగారు కొండ ప్లస్ కార్యక్రమాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద చేపట్టే ప్రతిపాదనలు సిద్ధం చేశామని కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గెయిల్ ప్రతినిధులతో గురువారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వయస్సుకు తగ్గ బరువు, ఎదుగుదల లేని, రక్తహీనత, తీవ్ర పోషకాహార లోపం గల పిల్లలను గుర్తించి వారిని సాధారణ స్థితికి తీసుకురావడం కోసం బంగారు కొండ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో ప్రయోగాత్మకంగా చేపట్టినట్టు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన సంబంధిత అంశాలను జోడించి బంగారు కొండ ప్లస్ కార్యక్రమాన్ని ఈ ఏడాది చేపట్టనున్నట్టు తెలిపారు. గత ఏడాది చేపట్టిన బంగారుకొండ కింద 1283 మందికి కిట్స్ అందించి 1169 మందిని సాధారణ స్థితికి తీసుకు వచ్చినట్టు తెలిపారు. నూటికి నూరుశాతం ఫలితాలు సాధించడం లక్ష్యంగా చేసుకుని అడుగులు వేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 469 మంది చిన్నారులు ఈ కేటగిరిలో ఉన్నట్టు గుర్తించామన్నారు. ఇతర కార్పొరేట్ సంస్థల సహకారంతో కౌమరదశలో ఉన్న బాలికలకు మునగపొడి అందించి రక్తహీనతను అధిగమించి అనీమియా లేకుండా పరిరక్షణా బాధ్యతలు చేపట్టామన్నారు. గెయిల్ చీఫ్ మేనేజరు కేవీఎస్ రావు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం తరఫున అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, పౌష్టికాహారలోపం నిర్మూలన, సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మేనేజరు (హెచ్‌ఆర్) ప్రభాకర్, ఐసీడీఎస్ జిల్లా స్త్రీశిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారి, ఇండస్ట్రీస్ అధికారి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన స్కూల్ అసిస్టెంట్ సస్పెన్షన్

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 3: రాజమహేంద్రవరం రూరల్ మండలం హుక్కుంపేట జడ్పీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావు విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ జరిపి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉపాధ్యాయుడిని కలెక్టర్ ప్రశాంతి సస్పెండ్ చేశారు. ఈమేరకు గురువారం కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలలో చదువుతున్న ఓ బాలిక ఇచ్చిన ఫిర్యాదుమేరకు కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ముగ్గురు అధికారులు విచారణ చేసి జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావుకు నివేదిక అందించారు. దీంతో ఏపీ సివిల్ సర్వీసెస్ కండక్ట్ రూల్స్‌ను ఉల్లంఘన, 1964ను అనుసరించి స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావుపై క్రమశిక్షణ చర్యల మేరకు రూల్ 20 ప్రకారం చేసిన ఆరోపణల నిర్ధారణ నేపథ్యంలో సస్పెన్షన్ ఆర్డర్ జారీచేసినట్టు పేర్కొన్నారు.

నేటి నుంచి టెట్ పరీక్షలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లు శుక్రవారం నుంచి 21వ తేదీ వరకూ నిర్వహిస్తారని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. లూథర్‌గిరిలోని రాజీవ్‌గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5 వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. గంటన్నర ముందు నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. మొత్తం 9,988 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉందన్నారు. సహాయ కేంద్రాలను ఏర్పాటుచేశామని, కేవీ సూర్యనారాయణ 9949602721, ఎస్ శ్రీనివాస్‌ప్రసాద్ 8985943354లలో సంప్రదించవచ్చని తెలిపారు. హాల్ టికెట్‌తోపాటు ఆధార్, డ్రైవింగ్ లైసెన్సు, ఓటరు గుర్తింపుకార్డు తదితర ఏదేని గుర్తింపు కార్డును తీసుకురావాలన్నారు. సెల్‌ఫోన్, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్, కాలిక్యులేటర్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌లో ఏవైనా తప్పులుంటే ఆధారాలు చూపించి పరీక్ష కేంద్రంలోని డిపార్ట్‌మెంటల్ అధికారి దగ్గర సరిచేయించుకోవచ్చన్నారు.



జీజీహెచ్ ప్రధాన భవనం ఎదుట దివ్యాంగుల ధర్నా దృశ్యం

జీజీహెచ్ ఎదుట దివ్యాంగుల ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 3 : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్) ఎదుట గురువారం పలువురు దివ్యాంగులు ధర్నాకు దిగారు. రూ.15,000 పెన్షన్‌కు సదరం సర్టిఫికెట్ల కోసం వచ్చిన తమకు సరైన సౌకర్యాలు కల్పించడంలేదని, ఆసుపత్రి సిబ్బంది తమ దరఖాస్తులను తీసుకోవడంలేదని జీజీహెచ్ ప్రధాన భవనం ఎదుట ధర్నా చేశారు. దరఖాస్తులు తీసుకోకపోవడంతోపాటు వీల్‌చైర్లు సమకూర్చడంలేదని ఆందోళన చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేయడంతో కొంతసేపు అలజడి నెలకొంది. దివ్యాంగుల ఆందోళనతో అప్రమత్తమైన ఆసుపత్రి అధికారులు అక్కడకు చేరుకుని వారితో మాట్లాడారు. అధికారుల హామీతో ఆందోళన విరమించారు. కాగా గురువారం కూడా దివ్యాంగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

5, 6 తేదీల్లో ఆర్టీసీ బస్‌పాస్‌లు జారీకావు

కొవ్వూరు, అక్టోబరు 3: ఆర్టీసీలో సాఫ్ట్‌వేర్ మారుతున్న కారణంగా ఈ నెల 5, 6 తేదీల్లో బస్‌పాస్‌లు ఇవ్వరని కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్ తెలిపారు. రెండు రోజులు సెలవు ప్రకటించామని 7వ తేదీ నుంచి యథావిధిగా పని చేస్తాయన్నారు. విద్యార్థులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.


తీపర్రులో సనాతన ధర్మ పరిరక్షణ కోరుతూ కూటమి నాయకుల పర్యటన

సనాతన ధర్మ పరిరక్షణకు కృషి

పెరవలి, అక్టోబరు 3: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు కూటమి నాయకుల ఆధ్వర్యంలో తీపర్రులో భజన చేస్తూ అన్ని ఆలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల లడ్డూ కల్తీ సందర్భంగా పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టి కాలి నడకన స్వామివారిని దర్శించుకుని దీక్ష విరమించారని నాయకులన్నారు. తాము కూడా స్థానిక ఆలయాలను సందర్శించి ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్, కంటిపూడి సూర్యనారాయణ, సింహాద్రి సత్యనారాయణ, దేవరపల్లి సత్యనారాయణ, కర్రి అంజి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన ఆర్డీవో

కొవ్వూరు, అక్టోబరు 3: నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన కొవ్వూరు ఆర్డీవో డాక్టరు రాణి సుస్మిత గురువారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కలిసి ఆయనకు పూలమొక్క అందించారు.


ఎమ్మెల్యే ముప్పిడికి పూలమొక్క అందిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

విజన్ స్వర్ణాంధ్రకు కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాసరావు

తాళ్లపూడి, అక్టోబరు 3: విజన్ స్వర్ణాంధ్ర 2047 విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పంచాయతీ జిల్లా అధికారి బి.శ్రీనివాసరావు కోరారు. విజన్ స్వర్ణాంధ్ర 2047 విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు, పలువురు పారిశ్రామికవేత్తల ప్రతినిధులతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీపీవో ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ బి.రవీంద్రనాద్, కార్యక్రమ కన్వీనర్ ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు పలు అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అమ్మిరాజు, జేఏ కిషోర్, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలి

ఉండ్రాజవరం, అక్టోబరు 3: సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ పేర్కొన్నారు. గురువారం ఉండ్రాజవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడంలో అధికారులు కృషి చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఇస్తున్న బియ్యం నాణ్యత లేదన్నారు. ఈ సమస్యను అధికారులు పరిష్కరించాలని చివటం ఎంపీటీసీ వేముల సత్యనారాయణ, తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎంఈవో సక్సేనరాజు మాట్లాడుతూ సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో పలువురు ఎంపీటీసీలు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పలువురు ఉద్యోగులు బదిలీపై వెళుతున్నందున వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో జేడీవీ ప్రసాద్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నిడదవోలు, అక్టోబరు 3: నిడదవోలు మండలం తాడిమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.చంద్రశేఖర్, ఎన్.అనిల్, ఎన్.శామ్యూల్‌రాజు, సీహెచ్ ఆకాష్, పి.మురళి రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు బండి ప్రదీప్ తెలిపారు. అక్టోబర్ 4 నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొననున్నారు.


ఇటీవల అదృశ్యమైన వివాహితతో పాటు పిల్లలను అప్పగిస్తున్న ఎస్ఐ

వివాహిత ఆచూకీ లభ్యం...అప్పగింత

పెరవలి, అక్టోబరు 3: ఇటీవల ముక్కామలకు చెందిన వివాహిత పిల్లలతో పుట్టింటికి వెళుతున్నానని చెప్పి అదృశ్యం కావడంతో ఆమె ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతనెల 28న ముక్కామలకు చెందిన వనచర్ల జానకి రాముడు భార్య రాణి ఇద్దరు పిల్లలతో పెరవలి మండలం అజ్జరంలో ఉన్న పుట్టింటికి వెళుతున్నానని చెప్పి వెళ్లింది. ఆమె పుట్టింటికి చేరకపోవడంతో భర్త ఫిర్యాదు చేశాడని ఎస్ఐ తెలిపారు. దీనిపై విచారణ జరపగా ఆమె పిల్లలతో హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించామన్నారు. అక్కడి నుంచి తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఆయన తెలిపారు.

నేడు నిడదవోలులో జాబ్‌మేళా

నిడదవోలు, అక్టోబరు 3: పట్టణంలోని ఎస్వీఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎంప్లాయిమెంటు ఆఫీసర్ హరిశ్చంద్ర ప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, డిప్లొమో, డి.ఫార్మసి, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఫార్మసి విద్యార్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. జాబ్ మేళాలో 3 కంపెనీలు పాల్గొననున్నాయని అర్హులైన అభ్యర్థులు దీన్ని సద్వినియోగపర్చుకోవాలని ఒక ప్రకటనలో వారు కోరారు.

వైభవంగా శరన్నవరాత్రులు ప్రారంభం

దేవీ నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు, గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో అమ్మవారి ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. తొలి రోజు గురువారం ఆయా ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీ దీక్షలు తీసుకున్న భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.


గోష్పాదక్షేత్రం బాలాత్రిపుర సుందరి అమ్మవారికి మహిళల పూజలు

కొవ్వూరు, అక్టోబర్ 15: గోష్పాదక్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి ఆలయం, సంస్కృత పాఠశాలలోని లలితాపార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామి ఆలయం, ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలు చేసి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో కార్మికుల ఆధ్వర్యంలో, మున్సిపల్ కార్యాలయం ఎదుట కనకదుర్గమ్మ ఆలయం, మెరకవీధి, లాంచీల రేవు కనకదుర్గమ్మ ఆలయాలు, మెయిన్‌రోడ్ పుంతలో ముసలమ్మ ఆలయం, గ్రామదేవత కొవ్వూరమ్మ ఆలయాలు, రామా సొసైటీ సమీపంలో యూత్ ఆధ్వర్యంలో, రెల్లిపేట నూకాలమ్మ ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు.

కొవ్వూరు మండలంలో: పశివేదల తూర్పుకాపుల వీధిలో దుర్గ మహేశ్వర ఆలయం వద్ద దేవీ నవరాత్రులను ఆలయ ధర్మకర్త ఆళ్ళ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో తుంపల్లి ఆదినారాయణ, కరిమజ్జి బాలకృష్ణ, మీసాల శ్రీను, రామకృష్ణ, గార శ్రీను తదితరులు పాల్గొన్నారు. కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామదేవతలు పుట్టాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్ల ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. తోగుమ్మి కొత్తపేటలో కనకదుర్గమ్మ ఆలయంలో మాజీ వైస్ ఎంపీపీ మద్దిపాటి సత్యనారాయణ దంపతులు పూజలు నిర్వహించి దేవీ నవరాత్రులను ప్రారంభించారు. కుమారదేవం గండి పోచమ్మ అమ్మవారి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. సీతంపేట సెంటర్‌లో ఉన్న కనకదుర్గమ్మ ఆలయం, దొమ్మేరు, పంగిడి గ్రామాల్లో దేవీ నవరాత్రులను ప్రారంభించారు. వాడపల్లిలో ఏర్పాటు చేసిన విజయ దుర్గాదేవిని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ సందర్శించి పూజలు చేశారు.


పల్లంట్లలో 108 కలశాలతో నదీ జలాలను తీసుకొస్తున్న భక్తులు

తాళ్లపూడి: మండల కేంద్రమైన తాళ్లపూడిలో నవదుర్గా సహిత కనకదుర్గ ఆలయంలో తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయంలో భవానీ భక్తులతో సందడి నెలకొంది. అన్నదేవరపేట గ్రామంలో వేగుళ్లమ్మ, మలకపల్లి కనకదుర్గ ఆలయాల్లో దేవీ నవరాత్రులు చేపట్టారు. మండలంలోని పలు గ్రామాల్లో దేవీ ఆలయాల వద్ద ప్రత్యేక పందిళ్లు వేసి దేవీ నవరాత్రులను ప్రారంభించారు.


నిడదవోలు కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్, కుటుంబ సభ్యులు

దేవరపల్లి: దేవరపల్లిలోని మూడుబొమ్మల సెంటర్ వద్ద సౌభాగ్య దుర్గాంబికాదేవి, పల్లపు వీధి రామాలయం వద్ద కనక దుర్గాదేవి, బాలదుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లంట్లలోని శ్రీరాజరాజేశ్వరి సమేత దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో దేవీ నవరాత్రుల్లో భాగంగా గన్నమని సత్యప్రసాద్, రమాదేవి దంపతులు రూ.70వేలు విలువైన అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఆలయానికి అందజేశారు. 108 కలశాలతో మహిళా భక్తులు, భవానీలు నగర సంకీర్తనలతో ఊరేగింపు నిర్వహించారు. 108 కలశాల నదీజలాలతో అమ్మవారికి అభిషేకం జరిపారు. టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కొయ్యలమూడి సుధారాణి, ఆలయ కమిటీ సభ్యులు బలుసు సత్యనారాయణ, కూచిపూడి సతీష్, కొయ్యలమూడి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. దేవరపల్లిలో అమ్మవారి ఆలయాల్లో ఎంపీపీ కేవీకే దుర్గారావు, టీడీపీ నాయకులు సుంకర దుర్గారావు, గద్దే సుబ్రహ్మణ్యం, కరుటూరి శ్రీనివాస్ తదితరులు పూజలు చేశారు.


పెద్దాపురంలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తదితరులు

గోపాలపురం: మండలంలోని పలు ఆలయాల్లో మొదటి రోజు అమ్మ వారు బాలత్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చారు. పెద్దాపురంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అమ్మవారిని దర్శించు కుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకుడు కొర్లపాటి రాము తదితరులు ఉన్నారు.


తాళ్లపూడిలో పూజలు చేస్తున్న భక్తులు

నిడదవోలు: తిమ్మరాజుపాలెం గ్రామంలోనున్న కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో గురువారం దేవులపల్లి కుటుంబ సభ్యులతో దేవీ నవరాత్రులను ప్రారంభించారు. కలశస్థాపన అనంతరం 132 మంది దంపతులతో ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజలు, చండీ పారాయణ, హోమం జరిపారు. అధికసంఖ్యలో భక్తులు కోట సత్తెమ్మ అమ్మవారి మాల స్వీకరించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా బంగారు నగల అలంకరణలో ఉన్న అమ్మవారిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకు న్నారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్, ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లు గ్రామ దేవత పాటెమ్మవారి ఆలయంలో గ్రామ పెద్దల సమక్షంలో కలశస్థాపన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వల్లుగంటలోనున్న కనకదుర్గమ్మ ఆలయంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చిన అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు పూజలు చేశారు. సెంటర్‌లోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రులు ప్రారంభమయ్యాయి. పాటెమ్మపేటలో బాల కనకదుర్గమ్మ నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఊనగట్ల కనకదుర్గమ్మ ఆలయంతో పాటు ఆయా గ్రామాల్లోని పలుచోట్ల దేవీ నవరాత్రులు ప్రారంభమయ్యాయి.


చాగల్లు పాటెమ్మ ఆలయంలో మాజీ ఎంపీపీ కేతా సాహెబ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

బీజేపీలో చేరికల కార్యక్రమంలో ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 3: రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాజధాని అమరావతి నిర్మాణంతోపాటు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి సహాయ సహకారాలు అందజేస్తామని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఎంపీ పురందేశ్వరి సమక్షంలో న్యాయవాది, సామాజిక సేవకురాలు విజయ చీలి, ఆమెతోపాటు పలువురు బీజేపీలో చేరారు. ఎంపీ పురందేశ్వరి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీజేపీ అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎన్‌సీసీ దోహదం

రాజానగరం: విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ దోహదపడుతుందని రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అన్నారు. రాజానగరంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎయిర్ కమోడోర్ వీఎం రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపు (ఎన్‌సీసీ) (ఏపీఅండ్‌టీ) ఎస్ఎన్ఐసీ కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మనదేశంలో వైవిధ్యం, భిన్నత్వంలో ఏకత్వం అంశాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎన్‌సీసీ బృందాలు బాధ్యతతో వ్యవహరించడమే కాకుండా సహాయ కార్యక్రమాలతో ప్రజలను రక్షించి వారికి అండగా నిలుస్తాయన్నారు. ఇటీవల విజయవాడలో వరద ముంపు ప్రాంతాల్లో ఎన్‌సీసీ బృందాల సహాయక చర్యలను మనం గమనించామన్నారు.

● గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం రూపొందించిన వెబ్‌సైట్‌ను ఎంపీ పురందేశ్వరి ప్రారంభించారు. జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు, కల్నల్ ఆర్ఎం అగర్వాల్, కాకినాడ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమోడోర్ వీఎం రెడ్డి, జీజీయూ ఉపకులపతి చంద్రశేఖర్, రిజిస్ట్రార్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్ర

మండల సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలి

పెరవలి, అక్టోబరు 3: మండల పరిషత్ సమావేశాలకు ప్రజా ప్రతినిధులతోపాటు గ్రామ, మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాద్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షుడు కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 18 గ్రామాల సర్పంచ్‌లకు ఐదుగురే హాజరయ్యారని తెలిపారు. మండలస్థాయిలో పనిచేసే అధికారులు సమావేశాలకు హాజరై ఆయా పథకాలపై సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. మల్లేశ్వరం ఎంపీటీసీ సభ్యుడు బి.దేవికారాణి మాట్లాడుతూ తమ గ్రామంలో ప్రముఖ దేవాలయాలు ఉన్నందున టెంపుల్ టూరిజంలో తమ గ్రామాన్ని కూడా ఎంపిక చేయాలన్నారు. ముక్కామల ఎంపీటీసీ గండేపల్లి రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల పశువులకు ఇచ్చే షెడ్లను అర్హులకు కాకుండా అనర్హులకు కేటాయిస్తున్నారన్నారు. పెరవలి ఎంపీడీవోగా పనిచేస్తున్న రమేష్, సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వేణు బదిలీపై వెళుతున్న సందర్భంగా సమావేశంలో వారిద్దరిని ఎమ్మెల్సీ రవీంద్ర, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అచ్యుత కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నల్లజర్ల, అక్టోబరు 3: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శంకుస్థాపన చేయనున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు చీపురుగూడెంలోని తుమ్మలమ్మ గుడి ఎదురుగా సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం కవులూరులో సీసీ రోడ్డు, పోతవరం, సుభద్రపాలెం, పోతిసీడుపాలెం, చాదరాశిగుంట, నబీపేట ప్రాంతాలకు చేస్తారు. భోజన విరామం అనంతరం గుండేపల్లి, తూర్పు చోడవరం, పడమర చోడవరం, తెలికిచర్ల గ్రామాల్లో పలు శంకుస్థాపనలు చేస్తారన్నారు. మండలంలోని కూటమి సభ్యులంతా హాజరుకావాలని ఆయన కోరారు.


వెంకటరత్నం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

మంత్రి రామానాయుడు పరామర్శ

నల్లజర్ల, అక్టోబరు 3: జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు తండ్రి వెంకటరత్నం ఇటీవల మృతి చెందడంతో ఆయన దిన కార్యక్రమం గురువారం ప్రియాంక కన్వెక్షన్ హాల్‌లో నిర్వహించారు. మంత్రి నిమ్మల రామానాయుడు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర రావు, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, తాడేపల్లిగూడెం టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జీ, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు తదితరులు ముళ్ళపూడి వెంకటరత్నం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తాతిన సత్యనారాయణ, ఏలేటి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, పసుమర్తి రతీష్, చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకట రమణ, వల్లూరి సత్తిపండు, చెల్లు పెద్దరామన్న, చెల్లు సుబ్రహ్మణ్యం, చెల్లు వీర వెంకట్రావు పాల్గొన్నారు.

చోరీపై పోలీసులకు ఫిర్యాదు

దేవరపల్లి, అక్టోబరు 3: దేవరపల్లి మండలం చిన్నాయిగూడెంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి 20గ్రాముల బంగారం చోరీ చేసినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన ఆలపాటి కుమారి గత నెల 23న భర్తకు అనారోగ్యం కారణంగా చికిత్స కోసం హైదరాబాద్ వెళ్లారు. గురువారం ఉదయం ఇంటిని శుభ్రం చేయడానికి వచ్చిన పనిమనిషి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో కుమారికి సమాచారం అందించింది. దీంతో వారు హుటాహుటీన హైదరాబాద్ నుంచి దేవరపల్లి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రల నిపుణులను రప్పించి విచారణ ప్రారంభించారు. బాధితురాలు కుమారి 20 గ్రాముల బంగారం, కొంత నగదు చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పొలం పిలుస్తోందిలో రైతులకు అవగాహన

తాళ్లపూడి, అక్టోబరు 3: మండలంలోని గజ్జరం, అన్నదేవరపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ, పశుసంవర్థక, కోఆపరేటివ్ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో రుచిత, వెటర్నరీ డాక్టరు బాలాజీ, అన్నదేవరపేట సొసైటీ సీఈవో శ్రీనివాసరావు, పైడిమెట్ట కాలువ ప్రెసిడెంటు యుల్లపూడి శ్రీరామచంద్రమూర్తి, గజ్జరం ఉప సర్పంచ్ శేషగిరిరావు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పెరవలిలో: ప్రస్తుతం వరి పంటపై చీడ పీడలు లేనందున అనవసరంగా పురుగు మందులు పిచికారి చేయవద్దని వ్యవసాయ సహాయకులు మాసరమ్మ, దుర్గాప్రసాద్ సూచించారు. పొలం పిలుస్తుందిలో భాగంగా కానూరు అగ్రహారం, తీపర్రులలో రైతు సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు కంటిపూడి సూర్యనారాయణ, కరుటూరి జనార్ధనరావు, కరుటూరి సుబ్బారావు, కాకర సత్యనారాయణ, కానూరు అగ్రహారంలో దాసరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

200 మందికి ఉచిత వైద్య సేవలు

చాగల్లు, అక్టోబరు 3: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య సేవలందించడం అభినందనీయమని మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఆళ్ళ హరిబాబు, టీడీపీ యువ నాయకులు నాదెళ్ళ శ్రీరామ్ అన్నారు. కూటమి ప్రభు త్వం వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా బ్రాహ్మణగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో టీడీపీ నాయకులు పత్తిపాటి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రాజ మహేంద్రవరం భానుతేజాస్ ఆసుపత్రికి చెందిన వైద్యులు గౌస్ బేగ్, ఎం.హరిబాబు, థెరిసాలు పలు వ్యాధులకు సంబంధించి 200 మందికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు గారపాటి బాబురావు, దొమ్మేటి వేణు, అల్లూరి రామకృష్ణ, శ్రీనిసత్యన్నారాయణ, గారాపాటి మునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు యువకులపై దాడి

ఒకరి పరిస్థితి విషమం

నిడదవోలు, అక్టోబరు 3: పట్టణంలోని లింగంపల్లిలో గురువారం సాయంత్రం నలుగురు యువకులపై మరో ముగ్గురు విచక్షణా రహితంగా దాడిచేసి పరారయ్యారు. ఈ దాడిలో గాయపడిన యువకులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పట్టణ పోలీసులు బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొవ్వూరు, అక్టోబరు 3: పట్టణంలో నేడు 33/11 కెవి సబ్‌స్టేషన్ మరమ్మతులను పురస్కరించుకుని విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్‌శాఖ నిడదవోలు డివిజన్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొవ్వూరు 11 కెవి రైల్వేస్టేషన్ ఫీడర్ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. దీంతో బాపూజీనగర్, లాయర్స్‌కాలనీ, చిన్న వెంకటేశ్వరస్వామి రోడ్‌లకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని వినియోగదారులు సహకరించాలన్నారు.

దేవరపల్లిలో: దేవరపల్లి విద్యుత్ టౌన్ ఫీడర్ లైన్ నిర్వహణతో పాటు చెట్లు తొలగింపు నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సిబ్బంది పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు.

రేపు ఏబీఎన్ కాలేజీలో నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ లీగల్ క్యాంపు

కొవ్వూరు, అక్టోబరు 3: మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వూరు ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 5న ఉదయం 11 గంటలకు నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ లీగల్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సమావేశానికి కొవ్వూరు కోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, ఆర్డీవో, డీఎస్పీ హాజరవుతారన్నారు.

నల్లజర్ల ఎస్ఐ బదిలీ

నల్లజర్ల, అక్టోబరు 3: నల్లజర్ల ఎస్ఐగా పనిచేసిన శ్రీహరిబాబు అన్నవరం బదిలీ అయ్యారు. గురువారం మధ్యాహ్నం బదిలీ ఉత్తర్వులు రావడంతో హుటాహుటీన అన్నవరం వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. త్వరలో మరొక ఎస్ఐ నల్లజర్ల వస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.